# ప్రపత్తి శ్రీసన్నిధానం

ఆధ్యాత్మిక మాసపత్రిక

కరీంనగర్ సంపుటి: 01 సంచిక: 09 నవంబర్ 2024 పేజీలు: 36 వెల: 30/-



అత్యధిక పాఠక ఆదరణ పొందుతున్న ఆధ్యాత్మిక పత్రిక



# ముఖచిత్రపరిచయం

అర్థం పరమార్థం, భక్తి పారవశ్యం కలిగించే పండుగలు భారతీయ సనాతన సంప్రదాయానికి జీవం పోస్తున్నాయి. మన ఇంటిముందు ఆరోగ్యప్రదాయినిగా, రక్షణగా నిలిచిన తులసీమాత విశిష్టతను చాటే పండుగ చిలుకు ద్వాదశి, క్షీరాబ్ది ద్వాదశి. శ్రీమహావిష్ణువునకు ప్రీతి పాత్రమైన ఈ కార్తీక దామోదర మాసంలో శ్రియఃపతి లీలలను స్మరించుకోవడం ఆరాధించడం వల్ల అద్భుత ఫలితాలు లభిస్తాయని, అలాంటి మహదవకాశం ప్రపత్తి శ్రీసన్నిధానం పాఠకులకు కలుగాలని ఈ సంచికకు ముఖచిత్రంగా చిత్రకారుడు ఆవిష్కరించాడు. 'దామ' అంటే తాడు 'ఉదర' అంటే కడుపు. శ్రీకృష్ణుని తాడుతో బంధించి ఆ లీలా విలాసానికి మంత్రముగ్ధురాలై యశోధమ్మ పరవశించింది. ఈ మాసం ప్రారంభంలోనే! ఆకాశదీపాలను వెలిగించి, ఇంటింటా తులసికోట వద్ద ఉదయం సాయం వేళ దీపాలు వెలిగించి ద్వాదశినాడు తులసి వివాహం నిర్వహించడం భక్తి మార్గాన్ని సుగమం చేసుకునే వేడుక. అందుకనే శ్రీవైష్ణవ భక్తులు ఇలా అంటారు.

"న కార్తీక సమో మాసో న కృతేన సమం యుగం।  
న వేద సదృశం శాస్త్రం న తీర్థం గంగాయ సమమ్ ॥  
కార్తీకః ప్రవరో మాసో వైష్ణవానాం ప్రియః సదా।  
కార్తీకం స్కలం యస్తు భక్త్యా సేవతే వైష్ణవః"॥

# గమనిక

ప్రపత్తి శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రికకు సలహాలు, సూచనలు, చందాదారుల చిరునామా మార్పులు, నూతన చందాదారులు కావడానికి ఇ-మెయిల్ ద్వారా తెలియజేయవచ్చును.

help desk:  
prapatti.srisannidhanam9@gmail.com

మాస పత్రిక చందా వివరముల గురించి సంప్రదించవలసిన హెల్ప్ డెస్క్ నెంబర్: 9502583323  
(ఉదయం 9 గం. నుండి రాత్రి 9 గం. వరకు)




**సంప్రదించండి**

**మా ఈ చిరు ప్రయత్నాన్ని స్వాగతించండి!!**

**-మేనేజింగ్ ఎడిటర్**

## ముఖ్య గమనిక

ప్రపత్తి శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రిక ఈ సంచికలో ప్రచురించిన రచనలలోని భావాలు ఆయా రచయితలవే, రచన సారాంశము రచయిత అభిప్రాయముగా భావించవలెను. ఈ రచనల భావంతో సంపాదకునికి, ట్రస్ట్‌నకు ఎటువంటి బాధ్యత లేదని పాఠకులు గమనించవలసినదిగా మనవి.

**- ఎడిటర్**

# ప్రపత్తి శ్రీసన్నిధానం

https://srisannidhanam.org

prapatti.srisannidhanam9@gmail.com

సంపుటి: 1 - సంచిక: 9 ఎడిటర్ : డింగిరి శ్రీనివాసమూర్తి నవంబర్ 2024 వెల : 30


## ఇందులో


4. సంపాదకీయం
శ్రీమాన్ శ్రీ వొద్దిపర్తి రామచంద్రమూర్తి

6. శ్రీరామానుజ సుధామాధురి
శ్రీమతి సముద్రాల శారద

8. శ్రీపతిస్తుతి
శ్రీమాన్ శ్రీ అమరవాది వేంకటనర్సింహాచార్యులు

9. శుభాశుభ నిర్ణయాలు-మీమాంస
శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య, సిద్ధాంతి

11. దాశరథి శతకము
శ్రీమాన్ శ్రీ గుదిమెళ్ళ మురళీకృష్ణమాచార్యులు

14. భాగవతంలో భగవంతుని అవతారగాథలు
శ్రీమతి తిరుమల నీరజ

15. తులసీ మహిమ
శ్రీమాన్ శ్రీ వోలేటి రవికుమారాచార్యులు

16. గీతామృతం
శ్రీమాన్ ఆచి వేంకట పాండురంగాచార్య

18. కార్తీక మాస వైభవము (ప్రత్యేకం)
శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి

20. జ్యోతిర్విజ్ఞానమ్
శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక

22. ధృవోపాఖ్యానం
శ్రీమతి మహాలక్ష్మి రాణి గుండు

23. అష్టలక్ష్మీ వైభవం
శ్రీమతి వంగల రాధిక

24. శ్రీరామాయణంలో ఉపకథలు
శ్రీమతి చక్రవర్తుల చూడామణి

26. జీవుడు కర్మను స్వతంత్రుడై చేస్తాడా?
శ్రీమాన్ శ్రీ శ్రీభాష్యం శ్రీనివాసాచార్యులు

27. శ్రీసంప్రదాయ సేవలో యాజ్ఞికపీఠమ్

29. తెలుసుకోవలసినవి మూడే
శ్రీమాన్ శ్రీ వంగల వెంకటాచార్యులు

30. శ్రీపరాంకుశసుధాంబోధి
శ్రీమాన్ పి. కృష్ణమూర్తి

31. వయస్సు - మనస్సు
శ్రీమాన్ శ్రీ కవి కృష్ణమాచార్యులు

నెలవారిపంచాంగం, మనదేవాలయాలు, పుస్తక పరిచయం, బాలవిజ్ఞానం, శ్రీసన్నిధిపదకేళి



## సంపాదక మండలి

వొద్దిపర్తి రామచంద్రమూర్తి చీఫ్ ఎడిటర్
సముద్రాల శారద వొపినియన్ ఎడిటర్
డింగిరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్

## గౌరవ సంపాదకులు

శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక
శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి ఆచార్య
శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహాచార్యులు

నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

సంపాదకీయం



# కార్తీకంలో నదీస్నానం సాధ్యమేనా?!

మన సంస్కృతీ సంప్రదాయాలు చెపుతున్న విషయాలను తరతరాలుగా ఆచరిస్తున్నాము. భయమో భక్తో వాటిని మనం గుర్తు చేసుకుంటూనే ఉంటాం. కార్తీకమాసంలో నదీ స్నానం చేయాలన్నది పెద్దల మాట! వర్షాకాలంలో నిండుగా ప్రవహించిన నదులు కార్తీక మాసం వచ్చేసరికి తమ ఉధృతిని తగ్గించుకుంటాయి. వరదతో పోటెత్తిన నదులలో కొట్టుకువచ్చిన చెత్తాచెదారం అంతా అడుగుభాగానికి చేరుకుని, అక్కడ ఉన్న ఇసుకవల్ల నీరు కాస్తా తేటగా మారుతుంది. రాళ్లనీ, వృక్షాలనీ రాసుకుంటూ సాగే నదులు, ఆయా ఖనిజాలనీ, మూలికలనీ తమలో కలుపుకుని ఔషధీగుణాలతో అలరారుతాయి. కార్తీకంలో చంద్రుని వెన్నెల ప్రభావం అధికంగా ఉంటుందని జ్యోతిష శాస్త్రం చెబుతోంది. శరదృతువులో వెన్నెల నదీ జలాలపై ప్రసరించడంవల్ల అవి అమృతతుల్యమౌతాయని పురాణాలు, ఇతిహాసాలు చెబుతున్నాయి. ఆధునిక విజ్ఞాన శాస్త్రవేత్తలు కూడా అవును నిజమే సుమా! అని చెబుతున్నారు. నీటి మీదా, మానవుల మనసు మీదా చంద్రుని ప్రభావం అధికంగా ఉంటుంది. అలాంటి చంద్రుడు ఈ కౌముది మాసంలో మరింత శక్తిమంతంగా ఉంటాడు. అందుకే కార్తీక మాసంలో నదీ స్నానం చేయాలన్నారు. కానీ నేడు మనం నదీ స్నానానికి వెళితే పుణ్యం మాటేమోకానీ అనారోగ్యం మూటగట్టుకోవాల్సి వస్తోంది. ముఖ్యంగా మనరాష్ట్రంలోని గోదావరితో పాటు దేశంలోని గంగా, యమునా, ఘగ్గర్, గోమతి నదులలో నీటి కాలుష్యం ఎక్కువగా ఉందని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) నివేదిక వెల్లడించింది.

దక్షిణగంగగా పిలిచే గోదావరి నదీ జలాలు పవిత్ర స్నానానికి పనికి రావని ఇటీవల ఎజిటి గుర్తించింది. తాగడానికి కాదు కనీసం స్నానం చేయడానికి, వ్యవసాయానికి కూడా పనికిరాని స్థితిలో గోదావరి నీటి ప్రమాణాలు ఉన్నాయంటే సమస్య తీవ్రత అర్థం చేసుకోవచ్చు. పట్టణ ప్రాంతాల పరిధిలోని నదిలో నీటి నాణ్యత పరిశీలిస్తే ప్రమాదకరమైన బ్యాక్టీరియాలు కనిపించినట్లు వెల్లడైంది. బ్యాక్టీరియా కలిగిన నీటిని తాగితే శ్వాస, ఉదర, చర్మ సంబంధిత వ్యాధులు సంక్రమిస్తాయి. ఇక జలచరాల మాట అంటారా, అవి అంతరించి పోతాయి. సేద్యం చేస్తే పంటలు సరిగా పండవు. ఇలాంటి సందర్భంలో లక్షలాది ఎకరాలకు సాగు నీరందిస్తూ, కోట్లాది మంది గొంతు తడుపుతున్న గోదావరి కొన్ని ప్రాంతాలలోని ప్రజలకు ప్రాణసంకటంగా తయారైంది. గోదావరి ఎన్నో మున్సిపాల్టీలు, పట్టణాలను పలకరిస్తూ సముద్రం చేరుతుంది. పట్టణాల నుంచి వచ్చే డ్రెయినేజి నీరు, పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలకు, పారేసిన ప్లాస్టిక్‌కు ఇతరత్రా చెత్త తోడవుతుండటంతో జలాలు కలుషితమవుతున్నాయి. ముఖ్యంగా పెచ్చుపెరుగుతున్న ఇసుక తరలింపు వల్ల కూడా నదీ జలాలు కలుషితమైన జీవ నదులు జీవశక్తులు కోల్పోతున్నాయి.

ప్రతియేటా అక్టోబరు నెలలో కొన్ని పట్టణపరిసరాల్లోని గోదావరి జలాలపై నురగ లాంటి పొర పేరుకుపోవడంతో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పరీక్షలు నిర్వహించి ఆందోళన వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. 'కొలిఫామ్స్' అనే బ్యాక్టీరియా ఉభయతెలుగు రాష్ట్రాలలో చాలా చోట్ల కనిపిస్తుందని ఇది మానవాళికి ముప్పుతెచ్చిపెడుతుందని హెచ్చరించిన సందర్భాలు లేకపోలేదు. నీటి నిలువ చేసే ప్రాజెక్టులు వాటి విధానాల వల్ల గోదావరిలో ఏడాది పొడవునా నీరు నిల్వ ఉంటోంది. ఇందులో మురుగు, వ్యర్థపదార్థాలు కలువడంతో నదీ జలాలు కలుషితమవుతున్నాయి. సేద్యానికి సైతం పనికి రాని విధంగా తయారవుతున్నాయి. నీటి నిలువకోసం కరకట్టలు వేయడం వల్ల ప్రవాహఉధృతికి కూడా వ్యర్థపదార్థాలు కొట్టుకు పోవడం లేదు. గోదావరి నదిలో అక్కడక్కడా వేసిన అడ్డుకట్టల వల్ల నీరు నిలిచి కాలుష్యం మరింత పెచ్చు పెరుగుతోంది. ముఖ్యంగా ధర్మపురి లాంటి యాత్రాస్థలాలలో ఆంజనేయ, లేదా ఇతర భగవత్ దీక్ష పూర్తి చేసుకున్న వారు తమ వెంట తెచ్చుకున్న దుస్తులను వస్తువులను కూడా నీటిలో వదిలేస్తుంటారు. ఇలా జలకాలుష్యం జరుగుతోంది. పర్యావరణ పరిరక్షణ కమిటీలు, ప్రభుత్వాలు కదలినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉంది. దీనికి ప్రజా చైతన్యం తోడైతే కొంతైనా ఫలితాలు కనిపిస్తాయి. ఇందుకు ప్రచారం చేయాల్సిన అవసరం కూడా ఉంది.

-వొద్దిపర్తి రామచంద్రమూర్తి (చీఫ్ ఎడిటర్)

# నెలవారి పంచాంగమ్

**కార్తీక మాసం 02-11-24 శుక్లపక్షంతో ప్రారంభమై 01-12-24 వరకు, 02-12-24 నుండి మార్గశీర మాసం**

05-11-2024 వరకు స్వాతి కార్తి, 06-11-2024 నుండి విశాఖ కార్తి 19-11-2024 నుండి అనూరాధ కార్తి,

**పండుగలు** : 01-11-24 శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి తిరు, కేదారవ్రతం, 02-11-24 బలిత్రిపద, 03-11-24 యమద్వితీయ, 05-11-24 మణవాళ మాహామునుల తిరు, నాగచతుర్థీ, 12-11-24 సర్వేషాం ఏకాదశి, 13-11-24 చిలుకు ద్వాదశి, తులసీ వివాహం, 14-11-24 వైకుంఠ చతుర్దశి, 15-11-24 కార్తీక పూర్ణిమ, 16-11-24 వృశ్చిక సంక్రమణము, 19-11-24 సంకష్టహరచతుర్థి, 26-11-24 సర్వేషాం ఏకాదశి,

## మాస ఫలాలు



**మేషం:** ఈనెల అనుకూలం. ఆర్థికంగా బాగుండును. వ్యవహారజయం, సంతానసౌఖ్యం. ముఖ్య స్నేహితుల వల్ల సమస్యలు తీరును.



**వృషభం:** ఈనెలలో మిశ్రమ ఫలితాలు. ఆర్థికంగా బాగుండును. ఆరోగ్య భంగములు, అకాలభోజనములు, స్థానచలనములు, గృహమార్పులు, సంతానసౌఖ్యం,



**మిథునం:** ఈ నెల అన్నిరంగాల వారికి యోగమే. చేయు వృత్తివ్యాపారాలందు రాణింపు ఉంటుంది. ఆరోగ్యం బాగుండును. ఆదాయంనకు లోటుండదు.



**కర్కాటకం:** ఈ నెల దూకుడుగా, దురుసుగా కోపంగా ప్రవర్తించుట, కొన్ని కార్యక్రమాలు మధ్యలో నిలచిపోయిననూ, చివరకు మీకు అనుకూలంగా పూర్తిఅగును.



**సింహం:** ఈనెల అన్ని విధాలుగా లాభించును. ఆర్థికంగా సంతృప్తి, స్నేహితులు మూలకంగా కొన్ని సమస్యలు పరిష్కారమగును. ఆరోగ్యం బాగుంటుంది. సంతానసౌఖ్యం.



**కన్య:** ఈనెల ఆర్థికంగా బాగుండును. గతంలో ఉన్న సమస్యలు పరిష్కారమగును. వ్యవహారజయం, కుటుంబ సంతోషములు గృహ నిర్మాణాదిపనులు కలసివచ్చును.



**తుల:** ఈ నెల బాగుండును. ఆదాయ వృద్ధి, ఆరోగ్య లాభములు, వ్యవహారజయం, సమస్యలు పరిష్కారమగును, ప్రమోషన్స్, కుటుంబ సౌఖ్యం,



**వృశ్చికం:** ఈ నెలలో కూడా సమస్యలు ఉండును. దుబారా ఖర్చులు, ఆదాయంనకు మించిన ఖర్చులు, పనులు పూర్తిగాక ఇబ్బందులు. కుటుంబ సమస్యలు తలెత్తును.



**ధనుస్సు:** ఈ నెల అంతంత మాత్రమే ఉంటుంది. కొన్ని సమస్యలు తీవ్రమగును. ఏపని చేయబుద్ధికాదు. ప్రతివిషయంలో మీకు వ్యతిరేకత.



**మకరం:** ఈనెలలో ప్రథమార్ధం చాలా బాగుండును. అన్నిరంగాల వారికి యోగమే. ఆరోగ్యలాభములు. ఆర్థిక సమస్యలుండును.



**కుంభం:** ఈనెలలో అన్ని విధములుగా యోగమే. ఆదాయం బాగుండును. ధైర్యంతో ముందుకు పోగలరు. వాహనసౌఖ్యం, కుటుంబసౌఖ్యం,



**మీనం:** ఈ నెలలో చేయు వృత్తి వ్యాపారాలందు రాణింపు ఆరోగ్యలాభం, వ్యవహారజయం, ఆర్థిక లావాదేవీలు సంతృప్తి నిచ్చును. యాత్రఫలప్రాప్తి, సంతాన సౌఖ్యం, ప్రయాణ లాభాలు

**యమ ద్వితీయ: ఈ రోజున యమునా దేవి తన సోదరుడు యమరాజుకు కార్తీక ద్వితీయ నాడు తన సొంత ఇంటిలో భోజనం పెట్టింది. అప్పటి నుండి ఈ రోజును యమ ద్వితీయ అని పిలుస్తారు. ఈ పవిత్రమైన రోజున తమ సోదరులకు అన్నం పెట్టి సోదరీమణులు సౌభాగ్యవతులు, సోదరులు దీర్ఘాయుష్మంతులు అవుతారని నమ్ముతారు. దీపావళి రెండో రోజున భగినీహస్తభోజనం అని సోదరీమణులు తమ సోదరులను భోజనానికి పిలుస్తారు. ధర్మపురి క్షేత్రంలో దేవాలయంలో గల యమ ధర్మరాజు ముందు గండ దీపంలో నూనె పోసి పూజిస్తారు. గండాలన్నీ తొలగిపోతాయని భక్తుల నమ్మకం.**

## మంచి రోజులివిగో...

ఈనెల వివాహ, గృహారంభ, గృహప్రవేశ శుభ ముహూర్తములు

3,7,8,10,13,14,17,20,25,

# ఫలించిన ప్రార్థన - సార్థకమైన వైదుష్యం



**- శ్రీమతి సముద్రాల శారద**

అష్టాంగాది యోగ సాధనా మార్గాల ద్వారా భగవత్తత్వాన్ని దర్శించటం. స్మృతి శాస్త్ర పురాణేతిహాసాల ద్వారా వెలువరించడం. భగవత్ సంబంధంగానే సంస్కృతి సంప్రదాయాలను ఏర్పాటు చేయటం. ఇత్యాదుల ద్వారా సనాతనులు ఋషివరేణ్యులు సత్యాన్ని దర్శింపచేశారు. నిత్య జీవితంతోనే అలౌకికతను, ఆధ్యాత్మికాన్ని సమ్మిళితం చేశారు. భగవద్ ముఖోద్గీతమగు ఆగమ, గీతా శాస్త్రాల ద్వారా ఎన్నో మార్గాలు తెలియ జేయబడ్డాయి. "సత్యాన్వేషణ" రూపకంగా అనేక మంది గురువులు ఆధునిక కాలం వరకు ఎన్నో మార్గాలను బోధిస్తూనే ఉన్నారు.

యోగమంటే ఉపాయ మని పెద్దలు వివరిస్తారు. కర్మ, జ్ఞాన భక్తి యోగముల ద్వారా భగవత్ తత్వ జ్ఞానం పొంద వచ్చునని కూడా శాస్త్రాలు తెలుపుతాయి. కానీ ఈ మూడు పరస్పరం ఒకదానితో ఒకటి కలిసే ఉంటాయి. పరమఋషులు ప్రబోధించిన సాధనా మార్గాలకంటే ఆళ్వారాదులు అనుభవించి భగవదనుభూతి పూర్వకంగా వారందించిన శరణాగతితో కూడిన భక్తి మార్గం మోక్షదాయకంగా తెలుపబడింది. భగవంతుని ఉనికి, భగవత్సాన్నిధ్య, భగవత్ సంబంధ భావనలు సామాన్య మానవునిలో కూడా భగవత్ గుణానుభవం తోనే ప్రారంభమవుతాయి. జ్వాజ్వల్య మానుడయిన సూర్య శక్తిని జీవ శక్తిగా సకల జీవరాసులు పొందాలంటే ఆ సూర్య కిరణాలు వాటి దరికి చేరితేనే పొందగలుగుతాయి. అలాగే మహనీయులయిన వారికి భగవత్ సాక్షాత్కారం భగవంతుని కళ్యాణ గుణానుభవం ద్వారానే సాధ్యం అవుతుంది. మన ఆళ్వార్లు, ఆచార్యులు మనకందించిన మార్గం అదే!

స్వరూప జ్ఞానం కలిగి భగవంతుడికి మనకు అనువర్తించే సంబంధ జ్ఞానాన్ని జ్ఞాన యోగంగా, అది భగవత్ ప్రేమతో నిండి సాగుతూ ఉంటున్నప్పుడు ఆ ప్రీతి కలిగి ఉండటాన్ని భక్తి యోగంగా, భక్తితో భగవంతుని కొరకే కర్మఫలత్యాగంతో జీవించడం కర్మ యోగంగా మన పెద్దలు ఎంతో విస్తారంగా వివరిస్తారు. అటువంటి భగవత్ సంబంధ జ్ఞానాన్ని తెలిసి తత్వ దర్శనం చేసినవారు కనుకనే భగవద్ రామానుజాచార్యులు సత్యాన్ని బోధించ గలిగారు. ఎంతటి విద్వాంసులనయినా మెప్పించగాలిగారు. "వైష్ణవం దర్శనం లోకే వర్ధయన్ వైష్ణవోత్తమః" అని వైష్ణవోత్తముడైన యతిరాజులు శ్రీమన్నారాయణుడే పరతత్వమనీ ప్రతిపాదించుచూ శ్రీరంగనాథ స్వామి ఆరాధనాదికములు సక్రమముగా నిర్వర్తింపచేస్తూ వసించే కాలమది. రంగనాథ దేవాలయ అర్చకులే కొందరు స్వార్థంతో ఆచార్యుల పర్యవేక్షణను సహించలేక వారిపై విషప్రయోగం చేశారు. ఆసమయంలో దాశరథి కూరేశులవంటి శిష్యులు ఎందరున్నా భక్తితత్పరులు, పండితులు నమ్మకంగల శిష్యుల ఆవశ్యకత కలిగింది.

అదే భగవత్ సంకల్పంగా గొప్ప విద్వాంసుడు యతి రాజులకు శిష్యుడైనాడు. సకల శాస్త్రపారంగతుడు అయిన యజ్ఞమూర్తి అను పేరు గల గొప్ప పండితుడు భగవద్రామానుజుల వారిని కలుసుకున్నాడు. ఆయన తిరుపతి సమీపంలోని 'వింజిమూరు' అను ప్రాంతానికి చెందిన అద్వైత విద్వాంసుడు. ఉత్తరాదిన తిరుగుతూ ఎందరో పండితులను వాదోపవాదాల్లో జయిస్తూ దక్షిణాదిలో శ్రీరంగానికి వచ్చారు. అంతటి విద్వాంసుని సంస్కరించటం, భగవద్రామానుజులకు సమర్థుడైన శిష్యుని ప్రసాదించటం అను రెండు భగవత్ సంకల్పాలు నెరవేరినాయి.

భగవద్రామానుజుల గొప్పతనాన్ని గురించి విని శాస్త్రవాదానికి రమ్మని యతిరాజులను ఆహ్వానించారు. "ఒకవేళ శాస్త్ర చర్చలో నిన్ను ఓడిస్తే ఏశిక్షను స్వీకరిస్తావు?" అని ప్రశ్నించారు భగవద్రామానుజులు. అప్పుడు యజ్ఞమూర్తి

# శ్రీరామానుజ సుధామాధురి



"అహం త్వయా యది జితః త్వన్మతే సంప్రవిశ్య చ।
శిరసా పాదుకే ధృత్వా నామధేయం వహామి తే॥" అన్నారు. అనగా నేను నీచేత జయించ బడితే నీ పాదుకలను శిరసా గ్రహించి (ఆచార్యులుగా స్వీకరించి) నామధేయం వహించి నీమతంలో ప్రవేశిస్తానని శపథం చేశాడు. ఒక వేళ భగవద్రామానుజులు ఓడితే తాను ఓడితే "గ్రంథ త్యాగం కరోమ్యహం" గ్రంథాలను పరిత్యాగం చేస్తాను. అని శపథం చేశారు.

పరస్పరం 18 రోజులు వాదోపవాదాలకు అవధిని ఏర్పరచుకొని ప్రారంభించారు. అలా, 16రోజులు వరకూ సమఉజ్జీగా సాగిన ఆయుద్ధం 17 వ రోజున యజ్ఞమూర్తుల యుక్తి కౌశలంతో ఆయనదే పైచేయి కాసాగింది. ఆరోజు ముగిసి చివరి రోజు పద్దెనిమిదోరోజు రానే వచ్చింది. మరునాటి చర్చల రోజు కోసం ఆయత్తమవుతున్న యతిరాజులకు కొంత వ్యాకులత చుట్టు ముట్టిందట! వారి ఆరాధనా (దైవం) పెరుమాళ్ పేరు "పేరరుళాలన్" (వరదరాజస్వామి) ఆస్వామికి అనుష్ఠానానంతరం ప్రదక్షిణం, ఆచరించి చేతులు జోడించి "నమ్మాళ్వారులు నాథమునుల నుండి బహుకాలంగా అనుస్యూతమైన ఈ వైష్ణవ దర్శనానికి తనవల్ల లోటు రావటం భరించరానిది అంటూ పార్థించారట! సంప్రదాయంలో గృహంలో ఆరాధించే (మూర్తి) స్వామియొక్క ప్రాధాన్యమును పెద్దలు చక్కగా వివరిస్తారు. గృహ పెరుమాళ్ దేవరాజును ప్రార్థించి అదే కలతతో ఆరాత్రి నిద్రించిన భగవద్రామానుజులకు కలలో వరదరాజస్వామి సాక్షాత్కరించి కొన్ని సూచనలు చేసారు.

18 రోజులలో యజ్ఞమూర్తులచే జ్ఞాన ప్రదర్శన చేయించటం గొప్ప విద్వాంసులైన వారిని మీకు శిష్యులుగా చేయటానికే అని తెలిపారు. మరియు వేద సార నిర్దేశమైన, యామునమునులచే రచింపబడిన సిద్ధిత్రయ గ్రంథాన్ని, మాయావాద ఖండనను ప్రమాణంగా తీసుకొని వాదన కొనసాగించాలని వరదరాజస్వామి సూచించారని చరిత్ర.

మరునాడు ఉదయాన్నే మేల్కొన్న యతిరాజులు ఆ స్వప్న వృత్తాంతాన్ని తలుచుకొని తన గృహ పేరుమాళ్ దేవరాజుకు (పేరరుళాళన్ అను ద్రావిడ నామం) అనగా వరదరాజస్వామికి నమస్కరించి వాదానికి బయలుదేరారు. సంప్రదాయంలో గృహపెరుమాళ్ ఆరాధనకు ప్రత్యేక స్థానం ఉన్నది. ఎంతటి జ్ఞానులకైనా భగవత్ శరణాగతియే అభయకారకమనే సత్యాన్ని వెలువరించారు.

తత్వ దర్శనం చేసిన భగవద్రామానుజాచార్యుల స్ఫురద్రూపం విరాజిల్లుతున్నది. ఇరువురు వాదనలకు ఉపక్రమించే సమయంలో భగవద్రామానుజుల ముఖవర్చస్సు చూడగానే సర్వం గ్రహించిన యజ్ఞమూర్తులు యతిరాజులకు కైమోడ్చి శిష్యులుగా స్వీకరించమని ప్రార్థించారు. సన్యాసిగా అద్వైత తత్వ (అనగా ఒకే తత్వం) సూచికగా ఏకదండం ధరించే యజ్ఞమూర్తులు తత్వత్రయ (చిత్, అచిత్, ఈశ్వర) సూచికగా జల పవిత్రను గల త్రిదండాన్ని దాల్చారు. అనుకున్న విధంగా "ఎంబెరుమనార్" అని యతిరాజుల నామమును మరియు భగవత్ రామానుజుల ఆరాధనమూర్తి అయిన "అరుళాళ పెరుమాళ్" అను వరదరాజ స్వామి నామమును "అరుళాళ పెరుమాళ్ ఎంబెరుమానార్" అను నామాన్ని స్వీకరించారు. సంస్కృతములో దేవరాజముని అని పేరు.

(మరికొన్ని విశేషాలు వచ్చే మాసం)

# శ్రీపతి స్తుతి - సుభాషితం

మంచి మాట

## గజేంద్ర మోక్ష విషయమైన శ్లోకత్రయము

3. శ్లో॥ పాతర్భజామి భజతామభయంకరం తం
ప్రాక్సర్వ జన్మ కృత పాప భయాపనుత్త్యై।
యో గ్రాహ వక్త్ర పతితాంఘ్రి గజేంద్రఘోర
శోక ప్రణాశన కరో ధృత శంఖ చక్రః॥

ప్రతిపదార్థము: యః = ఏ పరమాత్మ, గ్రాహ = మొసలియొక్క, వక్త్ర = నోటియందు, పతిత = పడినట్టి, అంఘ్రి = పాదము గలిగిన, గజేంద్ర = గజేంద్రునకు గలిగిన ఘోర = భయంకరమైనా, శోక = దుఃఖమును, ప్రణాశనకరః = పోగొట్టిన వాడో, ధృత = ధరించిన, శంఖ చక్రః = శంఖము చక్రము కలవాడో, తం = అట్టి, భజతాం = తనను సేవించు వారికి, అభయం కరం= అభయము నిచ్చు శ్రీమన్నారాయణుని, ప్రాక్ = పూర్వము, సర్వజన్మ = అనేక జన్మలలో, కృత = చేయబడిన, పాప = పాపముల వలన కలిగిన, భయ = భయమును, అపనుత్త్యై = పోగొట్టుటకొఅకు, ప్రాతః = ప్రాతః కాలమున, భజామి = సేవించుచున్నాను.


తాత్పర్యం: భగవంతుడు మొసలి నోటిలో తగుల్కొనిన పాదము గల గజేంద్రుని తీవ్రమైన దుఃఖమును తొలగించినాడు, శంఖ చక్రములను ధరించినవాడు. తనను భక్తితో సేవించు వారికి అభయము నిచ్చువాడు. మనము ఈ జన్మకంటే మొదటి జన్మలలో ఎన్నో పాపములను చేసినాము. వాటిని అనుభవించుటకై భయపడుచున్నాము. ఆ భయాన్ని పోగొట్టి అభయము నిచ్చి కాపాడుటకై ఏకైక సమర్థుడు ఆయనయే! అందుకై తెల్లవారి లేవగానే శ్రీమన్నారాయణుని సేవించు చుండవలెను.

ఫలశృతి

శ్లో॥ శ్లోకత్రయ మిదం పుణ్యం ప్రాతరుత్థాయ యః పఠేత్।
లోకత్రయ గురుః తస్మై దద్యాదాత్మ పదం హరిః॥

ప్రతిపదార్థం: పుణ్యం = పూణ్యమైన, ఇదం = ఈ, శ్లోకత్రయం = మూడు శ్లోకములను, ప్రాతః = ఉదయమున, ఉత్థాయ = లేచి, యః = ఎవడు, పఠేత్ = చదువునో, తస్మై = అతనికి, లోకత్రయ గురుః = మూడు లోకములకు పూజ్యుడైన, హరిః = శ్రీమన్నారాయణుడు, ఆత్మపదం = తన స్థానమును, దద్యాత్ = ఇచ్చును.

తాత్పర్యము: సమస్త పాపములను తొలగింప సమర్థములైన, పుణ్యములను అందించు సమర్థమైన ఈ మూడు శ్లోకములను తెల్లవారి లేవగానే ఎవరు చదువుతారో వారికి ముల్లోకములలో, పూజనీయుడైన శ్రీహరి తన దివ్య ధామమైన శ్రీవైకుంఠమును ప్రసాదించును.



**శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనరసింహాచార్యులు**

ఆత్మ బంధువులారా! శ్రీపతిస్తుతి మాలలోని పై స్తోత్రములను ప్రతిపదార్థ తాత్పర్య విశేషాలను అనుభవించాము. పిదప పరత్వాది పంచకస్తుతి గ్రహించుటకన్న అందరికి పఠన సులభమై, పరమాత్మకు పరమ ప్రీతియైన "ముకుంద మాల" లోని విశేషాలను విందాము.

దాని వలన మనకు సంస్కృత భాష కొంత సులభమయ్యే అవకాశం వుంది. ఏమంటారు? ఫరవాలేదా? ముకుంద మాల చదువు కుందామా?.. (అతి త్వరలో మీముందుకు )


## ప్రింట్ కాపీ కావాలా!

**ఉచితం...ఉచితం...ఉచితం వెంటనే త్వరపడండి**

దీని కోసం మీరు చేయాల్సిందల్లా పత్రికను ఆన్ లైన్లో లేదా ఆఫ్ లైన్లో పూర్తిగా చదివి మీ అమూల్యమైన అభిప్రాయాలను తెలియజేయడమే. మీ అభిప్రాయాలు ప్రచురించడంతో పాటు ఒక నెల పత్రిక ఉచితంగా పంపిస్తాము. చిరునామాను వాట్సప్ ద్వారా తెలియజేయండి

**– ఎడిటర్ (95025 83323)**

# శుభాశుభ నిర్ణయాలు-మీమాంస

(క్రిందటి సంచిక తరువాయి)

శ్లో॥ హపయా మధ్యమేకోష్ఠే వక్షో మాత్రే భవేదధః॥
నృ కపాలం కచాభస్మ లోహం తత్కుల నాశనం॥

తా: ప్రశ్న అక్షరము హ.ప.య. అను వర్ణములయిన మధ్యభాగమందు రొమ్ములోతున మనిషితల పుర్రెగాని, బూడిదగాని, ఇనుప ముక్క గాని వుండును. యిది వంశనాశమును కలిగించును. (జ్యోతిర్నిబంధం)

గురుః కర్తార మన్వీక్ష పదే చ్ఛల్యంతు తద్గుణైః॥
యదంగ స్పర్శనం కర్తుః వాస్తు గేహే తదంగకే॥
శల్యం వినిర్దిశే త్ప్రాజ్ఞః శిరసి స్పర్శనేయది॥
శిరస్థానే హేమశల్యం నాసిక స్పర్శనే యది॥
నాసికాయాం చైవ హస్తా చ్ఛందనం సప్త తాలకే॥
గళే స్పర్శే హస్తి శల్యం స్యాత్ షట్తాల ప్రమాణతః॥
ఊరు సంస్పర్శనే చైవ రజితం పంచతాలకే॥
నాభి స్పర్శే చతుస్తాళం కాంస్య శల్యం వినిర్దివేత్॥
గుహ్య సంస్పర్శనే తామ్రం శల్యం చైవ త్రితాలకే॥
జాన్వోశ్చ స్పర్శనే చైవ ఆయస్యాద్ధస్త మాత్రతః॥
తథా గుల్పస్య సంస్పర్శే త్రపు శల్యం వినిర్దిశేత్॥
బాహ్వోశ్చ స్పర్శనే చైన ఆజానాం శల్యముద్ధరేత్॥
(వశిష్ఠసంహిత)

గృహ నిర్మాణము చేయుస్థలములో ఏకాశీతి పద వాస్తు మండలము ఏర్పరచి అందులో వాస్తు పురుషుని అంగములను విభజించి తదుపరి గృహనిర్మాణము చేయు యజమాని అవయవ చేష్టచే వాస్తు పురుషుని అవయవములందు శల్యములున్నవని నిశ్చయించవలయును.

గృహము నిర్మించు యజమాని శిరస్సును స్పృశించి ప్రశ్నించిన వాస్తు పురుషుని శిరోభాగమున్న ప్రదేశమందు ఎనిమిది తాళముల ప్రమాణములోతున హేమ శల్యముండును. ముక్కును తాకుచు ప్రశ్నించిన నాసిక యున్న ప్రదేశములో ఏడు తాళముల లోతున చందనపు కర్ర యుండును. కంఠమును స్పృశించుచు ప్రశ్నించిన కంఠస్థానమున ఆరు తాళములలోతున ఏనుగు యెముక లుండును. తొడను స్పృశిస్తూ ప్రశ్నించిన తొడ స్థానములో ఐదు తాళముల లోతున (రజిత కడ్డీ) వెండి కడ్డీ వుండును. బొడ్డును తాకుచు ప్రశ్నించిన నాభిస్థానములో నాలుగు తాళముల లోతున కంచు కడ్డీ వుండును. గుహ్య ప్రదేశమును స్పృశించుచూ ప్రశ్నించిన గుహ్య స్థానమునందు మూడు తాళము లలో రాగి ముక్కలుండును. మోకాలును తాకుతూ ప్రశ్నించిన జాను స్థానమందు హస్త



**శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి**

ప్రమాణము లోతున ఇనుము వుండును. చీలమందను తాకుతూ ప్రశ్నించిన గుల్పస్థానమున హస్త ప్రమాణము లోతున సీసపు ముక్కలుండును. చేతులను తాకుతూ ప్రశ్నించిన బాహువులున్న స్థలమునందు హస్త ప్రమాణము లోతున పాము ఎముకలుండును. పార్శ్వ భాగమును స్పృశించుచూ ప్రశ్నించిన ప్రార్శ్వ భాగముందు మేక ఎముకలుండును. పైవిధముగా నిర్మాణము చేయుస్థలమును పరిశీలించి శల్యములున్న ప్రదేశములను తెలుసుకొని ఆ శల్యములు తీసి గృహనిర్మాణము చేయవలయును.

శ్లో॥ గృహారంభే చ కండూతిః స్వాంగే యత్ర ప్రవర్తతే॥
శల్య మాసాదయేత్తత్ర ప్రాసాదే భవనేతథా॥

గృహ నిర్మాణము ప్రారంభించు సమయములో గృహ యజమానికి ఏ అవయవము నందు దురద కలుగునో వాస్తు పురుషుని ఆ అవయవము నందు శల్యములున్నవని నిర్ణయించవలయును.

శ్లో॥ యదంగం సంస్పృశే త్కర్తా మస్తకం శల్య ముద్ధరేత్॥
అష్టతాళా దధస్తస్మిక్ తత్ర శల్యం న సంశయః॥

గృహయజమాని ఏఅవయవము తాకునో దానిని బట్టి కూడా శల్యములున్న స్థానమును నిర్ణయింపవలెను. గృహయజమాని యొక్క శిరస్సున దురద గలిగినను స్పృశించినను ఏనిమిది తాళముల లోతున శల్యములుండును

శ్లో॥ నాసికా స్పర్శనే కర్తు ర్వాస్తో శ్శల్యం తదల్పకం।
స్థితం వినిశ్చితం బ్రూయాతల్లక్షణ మధో2చ్యతే॥

నాసిక యందు దురద గల్గిన స్పృశించిన వాస్తు పురుషుని నాసికా స్థానమున్న ప్రదేశములో చిన్న శల్యములుండును.

శ్లో॥ శిరసః స్పర్శనే వాస్తో స్సార్థహస్తా దధఃస్థితం।
మౌక్తికం కరమాత్రేణ ముఖస్పర్శేన దేహినః॥

శిరస్సును స్పృశించినను దురదగలిగినను వాస్తు పురుషుడు శిర ప్రదేశమున్న స్థలమందు ఒకటిన్నర హస్తము లోతున శల్యమున్నదనియు ముఖమును స్పృశించిన దురదగలిగిన మూడు హస్తములలోతున ముత్యమున్నదనియు నిర్ణయించవలయును.

శ్లో॥ వాజిదంతం మహాశల్య ముద్ధరే ద్వాస్తు తంత్రవిద్।
కరస్పర్శే కరే వాస్తోః ఖట్వాంగే చ కరాదథః॥

ఒకచేతితో రెండవ చేతిని స్పృశించుచు గాని దురద గలిగి గోకుచుగాని ప్రశ్నించిన వాస్తు పురుషుని ఆకారమున్న ప్రదేశములో హస్త ప్రమాణము లోతున గుఱ్ఱపు దంతములున్నవని నిర్ణయించవలయును.

(షడ్గణీకృత సూత్రమును బట్టి స్థలమును శోధించవచ్చును)

శ్లో॥ సుధృతే సమమే తస్మిన్ సూత్రం కేనాపి లంఘితం।
తదస్థి తత్ర జానీయాత్పురుషస్య ప్రమాణతః॥

సూత్రమును ప్రస్తరించినపుడు ఆ సూత్రమును యే జంతువు దాటునో అక్కడ పురుష ప్రమాణము నందు ఆ జంతువు యొక్క శల్యములుండునని నిశ్చయింపవలయును.

శ్లో॥ ఆసక్తో దృశ్యతే యస్మాద్దిశం శల్యం సమాదిశేత్॥

ఆసక్తితో కర్త యేవైపునకు చూచునో ఆదిక్కులో శల్యములున్నవని తెలిసికొనవలయును.

శ్లో॥ సూత్రితే సమయే యత్ర ఆసనోపరి సంస్థితః।
తదస్థి తత్ర జానీయాత్ క్షితౌక్షణే నసంశయః॥


సూత్రమును పట్టునపుడు యెచట ఆసనము పై భాగము నందు ఏ జంతువుండునో ఆ జంతువు యొక్క ఎముకలు అచ్చట వుండునని నిర్ణయించవలయును

(మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో)


# పుస్తక పరిచయం

## "అకర్దమ మిదం తీర్థం "

"వాల్మీకి గిరి సంభూతా రామసాగర గామినీ" అని వాల్మీకి మహర్షి అనెడు గిరి సంభూతమయిన రామకథ అనే పుణ్య నది లోకాన్ని పవిత్రం చేస్తుందని పెద్దల మాట! అటువంటి రామకథామృతాన్ని అనేక కోణాల్లో ఎందరో ఆవిష్కరిస్తూనే ఉన్నారు. శ్రీరామాయణ ప్రవచనాలు చేస్తూ నిత్యనూతనంగా హృదయంలో స్ఫురించిన రామ కథామృతంలోని విశేషాలను రచించిన గ్రంథం "అకర్దమ మిదం తీర్థం" అను




గ్రంథం. శాస్త్ర రత్నాకర, సాహిత్యభూషణ మొదలగు బిరుదాంకితులు జీవా అకాడమిక్ డైరెక్టర్, సంశోధకులు శ్రీమాన్ సముద్రాల వేంకట రంగ రామానుజాచార్యులు రచించారు. జీవా గ్రంథమాల ద్వారా ముద్రితమయిన 16వగ్రంథము. శ్రీరామాయణం బాలకాండ లోని "అకర్దమ మిదం తీర్థం" అనుశ్లోకమును మూలంగా గ్రహించి, అదే గ్రంథనామంగా స్వీకరించారు. 180 పేజీలు గల ఈ




పుస్తకం ఆకర్షణీయమైన నీలి రంగు అట్టతో చక్కని ముఖ చిత్రంతో జీయర్ ఇంటిగ్రేటెడ్ వేదిక్ అకాడమీ ద్వారా ముద్రించ బడింది. వాల్మీకి రామాయణంలోని కథాకథనాన్ని, వాక్యనిర్మాణ విశేషాలను సమగ్రంగా వివరిస్తూ రచన సాగింది. ఋష్యశృంగ కథ, సీతారామ కళ్యాణం, విశ్వామిత్రకథ, గంగావతరణ, స్కందోత్పత్తి అహల్య కథ, హనుమద్ భాషణం ఇత్యాది అనేక విశేషాలను కొంత స్పృషిస్తూ రచన సాగింది రామ కథా ప్రియులను, ప్రవచన కారులను, సాహితీప్రియులను, విమర్శకారులను కూడా అలరిస్తుంది. చక్కని సమాచారాన్నిస్తుంది. లభించు ఫోన్ నం. 844158 2863, 967682561



# దాశరథి శతకము

## ('భద్రవేది' వ్యాఖ్యానసన్నుతి)



( గతసంచిక తరువాయి.)

1. పద్యప్రసూనము

రమతే రమయా సార్ధం తేన రామం విదుర్బుధాః।
రమాయాః రమణస్థానం రామం బ్రహ్మ విదో విదుః॥

వృద్ధహారీత స్మృతి లోని ఈ శ్లోకమునందు రామ నామము రమా (లక్ష్మీ) సంబంధముగా నిర్వచించబడినది. రమతో ఆనందించువాడు కావున రాముడు అని ఒక అర్థము. ఇది విద్వాంసులైనవారు చెప్పేమాట. రమకు ఆనందనిలయమైన వాడు కావున రాముడు అని మరొక అర్థము. ఇది బ్రహ్మ వేత్తలైనవారు చెప్పేమాట. ఈ రెండు నిర్వాహముల యందును ఆనంద స్వరూపుడు అయిన వాడు రాముడు అని తెలియుచున్నది.



'ఆనందో బ్రహ్మ' అను ఉపనిషద్వాక్యమునకు రమణీయభావార్థ నామము రామ నామము అనునది ఫలితార్థము.

అంతే కాక రెండక్షరములుకల రామ శబ్దము ఆ దివ్య దంపతులిరువురికీ సంకేతమైయున్నది.

రా చేతి లక్ష్మీవచనః మశ్చేతీశ్వర వాచకః।
లక్ష్మీపతిం ప్రభుం రామం ప్రవదన్తి మనీషిణః॥

రా అను అక్షరము లక్ష్మీదేవి యొక్క సంకేత నామము గాను, "మః" అను అక్షరము తన్మనోభిరాముని యొక్క నామ సంకేతముగాను తస్మాత్ 'రామ' అనేనామము శ్రీలక్ష్మీ నాథుడైన శ్రీమన్నారాయణుని దివ్యనామముగాను జ్ఞానులంతా కీర్తించుచున్నారని ఆస్మృతియే చెప్పుచున్నది.

'ర' అనునది లక్ష్మీనామము లక్ష్మి ప్రకృతి స్వరూపము. ప్రకృత్యైనమః అను శ్రీ లక్ష్మీ అమ్మవారి అష్టోత్తరశతనామావళి లోని మొదటినామము, ప్రకృతి స్వరూపిణిగా అమ్మవారిని తెలియ చేయుచున్నది. ప్రకృతి యొక్క రూపాంతరమే విశ్వము. కావుననే లక్ష్మీవాచకమైన ర అను అక్షరము విశ్వము అను ఓ గూఢార్థమును తెలియచేయుచున్నది.

"రాశబ్దో విశ్వవచనః" అను స్మృతి వాక్యమే ప్రమాణము. ఆ

### శ్రీమాన్ శ్రీ గుదిమెళ్ళ మురళీకృష్ణమాచార్యులు

విశ్వమును శాసించేవాడు 'మః' అని సంకేతించబడినాడు. "మశ్చేతీశ్వరవాచకః" అను తదుపరి వాక్యము ఈ విషయమును తెలియజేయుచున్నది.

"విశ్వానా మీశ్వరో యో2సౌ తేన రామః ప్రకీర్తితః" విశ్వములు అనగా జగత్ సృష్టి, స్థితి లయాఖ్యాతము లయిన భగవంతునియొక్క శక్తి విశేషములు. ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులుగా శాస్త్రములు తెలిపిన వీటికి మాతృకా స్వరూపములే శ్రీ, భూ, నీళా దేవులు, కార్యదశలను బట్టి మూడుగా కనిపించే ఈ దేవీత్రయభావమునకే లక్ష్మి అనిపేరు.

ఈ విశ్వములకు ఈశ్వరుడు (శాసకుడు). కావున భగవంతునికి రాముడు అనిపేరు. "సర్వేశ్వరుడు, సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు అయిన శ్రీమన్నారాయణుడే రాముడు".

శ్రియో రమణ సామర్థ్యాత్ సౌశీల్యగుణ గౌరవాత్
శ్రీరామ ఇతి నామేదం తద్విష్ణోః ప్రకీర్తితమ్

ప్రకృతి మూర్తి అయిన (లక్ష్మీ) శ్రీదేవిని పాలన పోషణాదులచే ఆనందింపజేయు సామర్థ్యము వల్లను, ఆశ్రయణ సౌకర్యాపాదకములైన గుణములకు ఆకరమైన సౌశీల్యగుణము యొక్క సమృద్ధి వల్లను ఆ శ్రీమహావిష్ణువునకే శ్రీరాముడు అని పేరు.

# దాశరథి శతకము

రము క్రీడాయాం అనే ధాతువునుండి ఏర్పడిన రామ శబ్దము ఆనంద ప్రదత్వమును రమా (లక్ష్మీ) సంబంధమును తెలియ జేయుచున్నది.

విశ్వములోని సకల చేతనాచేతనములు పొంద వలసిన శాశ్వతానంద రూపమగు మోక్షమునకు రమ అనిపేరు. భగవదానందమునకు ఈ జీవుడు ఆస్పదమగుటయే మోక్షము. అది రమా సంబంధము వల్లనే సాధ్యము. ఆ రమకే 'కరుణ' అనిపేరు. "శ్రేయసీం శ్రీనివాసస్య కరుణామివ రూపిణీం" రూపుదాల్చిన కరుణయే లక్ష్మీదేవి.

ఆ కరుణయే విశ్వసృష్టికి మూలం. ఆ కరుణయే మోక్ష మునకు ఆలవాలం. అది భగవదధీనం. భగవంతునితో ఏనాడూ ఎడబాయని తత్వం. "అగలగిల్లేన్" అంటూ శఠకోప మునీంద్రులు చెప్పిన నిత్యానపాయనీ తత్త్వం, రామ పదంలోని అత్యంత రహస్యమైన అంతరార్థమిదే! అందుకే మన రామదాసుగారు శ్రీరామ నామముతో ఈ శతకాన్ని శుభారంభం గావించి, ఆ రామ పదం లోని అంతరార్థమును ప్రకటించుతూ 'కరుణాపయోనిధీ' అని సుసంపన్నము చేయుచున్నారు.

'శ్రీరఘురామ' అను సంబుద్ధిని శతకాది పదముగా చేసుకొని, 'కరుణాపయోనిధీ' అను సమృద్ధిని శతకాంత పదముగా ప్రయోగించుటలో ఆంతర్యము అద్భుతమైనది.

శ్రీరఘురామ అను పదము శ్రీరాముని యొక్క పరత్వమునకు "కరుణాపయోనిధీ" అనుపదము శ్రీరాముని యొక్క సౌలభ్యమునకు సంకేతములు. కరుణ... అనగా మనస్సును రక్షణానుకూలముగ చేయు భావార్ద్ర విశేషము. "కరోతి మనః ఆనుకూల్యాయ" అని నిర్వచనము "ఇష్టనాశాదనిష్టాప్తేః కరుణాఖ్యో రసోభవేత్" కావాలనుకున్నది దూరమైనప్పుడు వద్దనుకున్నది దాపురించినప్పుడు కలిగే భావ విశేషమునకే కరుణ అని పేరు. ఇలాంటి దుస్థితిలో ఉన్న వ్యక్తిని ఆదుకోవాలనుకునే వ్యక్తికి కలిగే రక్షణానుకూలమైన మనోవ్యాపారమును కూడ "కరుణ" అనియే వ్యవహరించుట దాని లక్షణము. ఇది రక్ష్య-రక్షక సంబంధమును తెలుపును. శ్రీరామ సేవయనే ఇష్టము నశించుచుండగా వివిధములైన యాతనలు కలుగుచుండగా మన రామదాసుగారు, రక్షకునిగా రఘు రాముని స్మరించి రక్షించుమని వేడుటయే 'కరుణా పయోనిధీ' అనుటలో విశేషము. రక్షణానుకూలమైన కరుణ అనే రసమునకు రాముడు సముద్రము వంటివాడు.

"యో వై సముద్రస్య పారం నపశ్యతి" అని వేదము చెప్పినట్లు అది అపారమైనది. అంతము తెలియనంత అపారము. ఎన్ని నదులు, ఎన్ని జలధారలు తనను ఆశ్రయించినా అన్నింటికీ అభయమైన ఆశ్రయమై, అతి గంభీరమై, అత్యంతప్రశాంతమై ఉండే సముద్రమువలె శ్రీరాముడు కూడా తనను ఆశ్రయించిన వారందరికీ ఆశ్రయమై ఆధారమై శాంతిని ప్రసాదించు కరుణా సముద్రుడు. శ్రీరాముని కరుణ కూడా అభయము, ఆశ్రయము, ఆధారము కావడంచేత శ్రీరాముడు అపార కరుణ కలిగిన వాడు అనే అంశమును కరుణా పయోనిధీ! అనే సంభోధన ద్వారా తెలియజేయుచున్నారు. మన రామదాసుగారు ఈ మకుటం ద్వారా తనకు (మనకు) శ్రీరామునికి మధ్యగల రక్ష్య రక్ష సంబంధమును ప్రధానముగా చేసుకుని, ఈ శతకంలో నవవిధ సంబంధాలను తెలియజేయ బోవుచున్నారు.

మనకు భగవంతునికి మధ్యగల తొమ్మిది సంబంధములకే "నవవిధ సంబంధముల"ని పేరు. లోకంలోని తోడి వారితో మనకు ఒకటో రెండో బంధములుంటేనే ఇంతగా వారిని ప్రేమిస్తున్న మనము, మనతో తొమ్మిది సంబంధములున్న భగవంతున్ని ఎంతగా ప్రేమించవలెనో, అతని కరుణకై ఎంతగా పరితపించవలెనో రామాదాసుగారు ఈ శతకంలో మనకు వివరించ బోతున్నారు.

మంగళాదిగా 'శ్రీరఘురామ' పదమును, మంగళాంతముగా 'కరుణా పయోనిధీ' అను పదమును ఒనగూర్చి శతకమును రచించినారు. కాదు శ్రీరాముని అర్చించినారు. 'తాత్పర్యమునన్ గ్రహింపుమిది' అంటూ శ్రీరామునికే అంకితము చేసినారు.

మన రామదాసుగారు శతకారంభమును శ్రీ - రామ పదముల నడుమ 'రఘు' పదమును ఒనగూర్చి చెప్పుటలో ఒక స్వారస్యమున్నది.

శ్రీ వాల్మీకి మహర్షి శ్రీరామాయణంలో తన కావ్యనాథుడైన శ్రీరాముని వంశమును 'ఆదివంశముగా' ప్రస్తుతించినాడు. 'ఆదివంశ విశుద్ధానాం' అనునది శ్రీవాల్మీకి యొక్క ప్రయోగము, ఆదివంశము అనగా మొట్టమొదటి వంశము అనుసామాన్యార్థము కాగా సూర్యవంశము అని విశేషార్థము. 'ఆది' అను పదమునకు సూర్యుడు అర్థమని ⇨

# దాశరథి శతకము

నిఘంటువులు పేర్కొన్నవి 'ఆదిత్య' నామములోని నామైక దేశగ్రహణము కావచ్చును. 'ఆదివారము' అను ప్రయోగమునకు పర్యాయపదములుగా భానువారము,

రవివారము ఇత్యాదులచే సమర్థితమునూ కావచ్చును. ఏవిధమైన నిర్వాహమైనను, సూర్యవంశము అనియే తాత్పర్యము.

ఈ వంశములోని వారందరూ ఆజన్మ పరిశుద్ధానాం! ఇత్యాదిగా పవిత్ర చారిత్ర వైభవము కలవారే! అయినా వీరిలో కొందరు తమ వైభవాతిశయముచేత వంశోద్దీపకులై విలసిల్లినారు.

కకుత్థ్సుడు, ఇక్ష్వాకువు, రఘువు మొదలగు వారు అలాంటి మహనీయులే. వీరిలో రఘుమహారాజు చరిత్ర నిరుపమానమైనది.

కవికులగురువగు కాళిదాసు, శ్రీరాముని యొక్క పూర్వోత్తర వంశ్యుల చరిత్రలను ఒక కావ్యంగా నిబంధించదలచి, ఆ మహాకావ్యానికి రఘువంశము అనే నామకరించాడు.

"క్వ సూర్య ప్రభవో వంశః" అని ప్రారంభించినప్పటికీ "రఘూణామ్ అన్వయం వక్ష్యే" అంటూ రఘువంశోద్భవు లందరి చరిత్రలను చెప్పబోవుచున్నానని ప్రకటించినాడు.

రఘువు తరువాతి వారందరూ కూడా రాఘవులుగా పరిగణించ బడుటను బట్టి కూడా ఆ మహారాజు యొక్క గరిమను గుర్తించవచ్చును. రఘువు అనే వాని గొప్పతనముతో పాటు, రఘు అనే నామసామర్థ్యము కూడ దీనికి ప్రబల కారణము.

రఘువు అనగా నేమి? "రంఘతి - లంఘుతి జ్ఞాన సీమాం ప్రాప్నోతి" అనే ధాతు నిష్పన్నమై వ్యాకరణ ప్రక్రియా సంపన్నమై రఘుః అనే పదం ఏర్పడినది. జ్ఞానపారంగతుడు అని భావార్థము.

"రంఘతి - లంఘతి జయసీమాం ప్రాప్నోతి ఇతి వా రఘుః" అనగా యుద్ధమునందు శత్రు సేనల వ్యూహాలను అతిక్రమించి జయమును సులువుగా పొందువాడు కావున 'రఘుః' అని మరొక అర్థము. జయపారంగతుడు అని దీని భావార్థము.

అనగా జ్ఞానశీలుడు, జయశీలుడు అయినవాడు రఘువు అని అర్థము. జ్ఞాన - జయములందు లాఘవము కలిగిన వారే ఏతత్ వంశీయులందరూ కావడంతో "ర లయో రభేదః" అను సూత్రమును బట్టి అందరూ రాఘవులే అయినారు.

" రఘూణా మన్వయమ్ వక్ష్యే"

ఈ చారిత్రక పురుషులందరినీ "రాఘవులు" గానే పరిగణించుచూ ఆరు శ్లోకముల కులకము (కుళకం) ద్వారా ప్రస్తావించినారు. "కులకం బహుభిః శ్లోకైః సాకాంక్షై రేక వాక్యతా" అనే సాహిత్య శాస్త్ర లక్షణాన్ని అనుసరించి, ఆకాంక్షతో కూడి ఏక వాక్యతానుగుణములగు శ్లోకముల సముదాయమునకు 'కులకము' అని పేరు.

ఇలా ఏకవాక్యత కలిగిన రెండు శ్లోకములకు 'యుగ్మము' అని మూడు శ్లోకములకు 'విశేషకము' అని, నాలుగు శ్లోకములకు 'కలాపకము' అని ఐదు శ్లోకముల నుండి ఎన్ని శ్లోకములైనా ఈ విధమైన ఏక భావ గతములైనప్పుడు వాటికి కులకము అనియే పేరు.

ఈ కులక మంతయు ఈ సూర్యవంశీయులందరినీ రఘువులుగానే పరిగణించినది.

కాళిదాసు ఈ రఘుమహారాజు యొక్క నామకరణ సందర్భమును ఏవిధముగా వర్ణించినాడో స్మరించతగును.

శ్రుతస్య యాయా దయ మన్త మర్భకః
తథా పరేషాం యుధి చేతి పార్థివః
అవే–క్ష్య ధాతో ర్గమనార్థ మర్థవిత్
చకార నామ్నా రఘు మాత్మ సమ్భవమ్

తన ప్రజ్ఞా లాఘవముచేత సకలవిద్యల అంతమును చూడగలడు, తన పరాక్రమ లాఘవము చేత సర్వశత్రువుల అంతమును చూడగలడు. కావున ఆ పిల్లవానికి (రఘువునకు) రఘువు అని నామకరణమును చేసెనట!

ఇటువంటి జ్ఞాన, జయ పారంగతత్వమునకు తగిన "ప్రజ్ఞా పరాక్రమ లాఘవము" కలిగినవాడు శ్రీ రాముడు. శ్రీరాముని చరిత్రలో ఈ లాఘవమును నిరూపించు ఘట్టములు అసంఖ్యాకములు. కావున శ్రీరాముని కథను సంపూర్ణముగా స్మరించుచూ మన రామదాసుగారు శ్రీరాముని 'శ్రీరఘురామునిగా' కీర్తించుచున్నారు.

ఈ విధముగా శ్రీ - రఘు - రామ అనే పద త్రయము భగవత్తత్వమును ఏవిధముగా నిరూపణము చేయుచున్నదో రాబోవు సంచికలో తెలుసుకుందాము.

(మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో)

★

# భాగవతంలో భగవంతుని అవతార గాథలు

(క్రిందటి సంచిక తరువాయి)

### సనకసనందనాదుల అవతారం

"దేవతలు మళ్లీ తమ కుమారుల వద్దకు వెళ్లి జరిగిన దంతా చెప్పారు. "మీరు పితృభక్తి కలిగిన ఉత్తములు. మీకు అన్ని విధాలైన ఇహలోక సుఖాలూ కలుగుతాయి. ఆముష్మిక సుఖాలూ చేకూరుతాయి. మన ఆనందం సోమునికి ఆనందం. అతని ఆనందం సంపూర్ణ జగానికే ఆనందం" అని పరస్పరం వీడ్కోలు చెప్పుకొని, ఎవరి దారిన వారు వెళ్లిపోయారు.

"ఇది పితృదేవతాసర్గం. పితృదేవతలను పూజించడం దేవతల ఆరాధన కన్నా ఎంతో గొప్పది. సురలు, మునులు, సిద్ధులు, సాధ్యులు అందరూ పితృదేవతల పూజల వల్లనే సకలశుభాలూ పొందుతారు" అని మార్కండేయునికి, సనత్కుమారుడు ఇంకా ఎన్నో పితృదేవతల పూజల పద్ధతులను వివరించి చెప్పాడు.

సనత్కుమారుని ఈ వరం వల్ల మార్కండేయమహర్షికి దివ్యదృష్టి, సర్వవిజ్ఞానమూ కలిగాయి.

ఒకప్పుడు రైభ్యుడు అనే మహర్షి గయాక్షేత్రంలో పితృదేవతలకు పూజలు చేసి, తపస్సు ప్రారంభించాడు. సూర్యప్రకాశంతో ఉన్న ఒక దివ్యవిమానంలో సనత్కుమారుడు అతనికి ప్రత్యక్ష మయ్యాడు. "వత్సా! ఏం కోరి తపస్సు చేస్తున్నావు?" అని అడిగి, చరాచర ప్రపంచమంతా నిండిన తన విశ్వరూపం ప్రదర్శించాడు.

రైభ్యుడు పరమానంద భరితుడై, సాష్టాంగ పడి, పలురకాల స్తుతులు చేసి, తనను అనుగ్రహించమని కోరాడు. సనత్కుమారుడు, అతడు చేసిన గయాశ్రాద్ధం, ఫల్గునీనదీ స్నానం అతని పుణ్యాన్ని పెంచాయని చెప్పి, గదాధరుణ్ని శ్రీమహావిష్ణువు గురించి తపస్సు చేసి, తన లోకానికి రమ్మని, అదృశ్యు డయ్యాడు. రైభ్యమహర్షి ఆయన తెలిపినట్లే చేసి, కైవల్యం పొందాడు.

సర్వలోకసంచారి ఐన నారదమహర్షి ఒకసారి సనత్కుమారుణ్ని దర్శించి, "నాకు జ్ఞానబోధ చేయి" అని ప్రార్థించాడు.

అప్పుడు సనత్కుమారుడు, "నీకు తెలిసిన దేమిటో చెప్పు. ఆ పైన నీకు తెలియనిది చెబుతాను" అన్నాడు.



నారదుడు, వేదశాస్త్ర పురాణాలు, నృత్యగీతాలు, ఇంకా తాను నేర్చిన వన్నీ చెప్పాడు. సనత్కుమారుడు, అతన్ని కరుణించి, "బ్రహ్మజ్ఞానం లేనిదే ఇవన్నీ వ్యర్థమే. ఆత్మజ్ఞానమే అన్ని జ్ఞానాలకూ పరమావధి" అని చెప్పి, నారదునికి అఖండ బ్రహ్మజ్ఞానాన్ని ఉపదేశించి పంపించాడు.

**శ్రీమతి తిరుమల నీరజ**

ఒకప్పుడు నైమిశారణ్యం లోని ఒకానొక పవిత్ర ఆశ్రమంలో వ్యాసభగవానుడు, ఋషిగణాలు తన చుట్టూ ఉండగా, బ్రహ్మ తనకు బోధించిన వేదాన్ని నాలుగు భాగాలుగా విభజించాడు. వాటిని తన శిష్యులతో విడివిడిగా అధ్యయనం చేయిస్తూ ఉండేవాడు. అప్పు డక్కడికి బ్రహ్మపుత్రుడైన సనత్కుమారుడు విచ్చేసి పరమానుగ్రహంతో వారికి దర్శన మిచ్చాడు. తర్వాత వారందరూ సమావేశమై, రుద్రమాహాత్మ్యాన్ని తమకు చెప్ప మని కోరారు. మహాయోగీంద్రుడైన సనత్కుమారుడు, శివమహత్త్వం అంతా వారికి విశదంగా వినిపించాడు. అది సనత్కుమార సంహితగా ప్రసిద్ధి చెందింది. ఇందులో బ్రహ్మవిష్ణువుల జననం, వారిద్దరి సంవాదం, సప్త ద్వీపాలు, సప్తవర్షాల చరిత్ర, శివలింగపూజ, శివలింగప్రళయోత్పత్తి, శివాష్టకం, మహాదేవ సంకీర్తన, జ్ఞానప్రశంస, మోక్షచర్చ, వస్తువిచారం మొదలైనవి ఉన్నాయి.

ఆ పిదప సనత్కుమారుడు, వారందరితో, "పూర్వం ప్రపంచ మంతా నీటితో నిండిపోయి, ప్రాణులందరూ మహేశ్వర తేజంలో మునిగిపోయారు. ఉన్నట్టుండి ఆ విధంగా జరగటంతో నేను విస్మితుణ్నయ్యాను. అప్పుడు మహాదేవుడు సాక్షాత్కరించి, తానే అన్నిటికీ (మిగతా 19 వ పేజీలో)




# శ్రీతులసీ మహిమ



**శ్రీమాన్ శ్రీ డా॥ వోలేటి రవికుమారాచార్యులు**

శ్రీమన్నారాయణుని పాదపద్మములను స్మరించినా, ఆ స్వామి ధరించే వనమాలను స్మరించినా, గోదాదేవిని స్మరించినా, శ్రీవిల్లిపుత్తూరును స్మరించినా, తిరువారాధన (పూజ) అనే పదం విన్నా, శ్రీవైష్ణవ లక్షణములను తలచుకున్నా (ఏ కంఠలగ్న తులసీ), తులసీ మహిమనే గుర్తుకు వస్తుంది. ప్రాణోత్క్రమణ సమయంలో ఉన్నవారికి ఉత్తమగతిని ప్రాప్తింప చేసే విషయాన్ని గమనించినా కూడా పరమ పవిత్రమైన తులసీ మహిమనే స్మరిస్తాము.

మనం తెలుగులో తులసి అని, సంస్కృత నామము తులసీ అని ద్రావిడంలో తిరుత్తుళ్ళాయ్ అని వ్యవహరిస్తాము. వైజ్ఞానికులు ఎన్నో ప్రయోగముల ద్వారా తులసీ ఆకులు, రసము, తులసీ వనం, మొక్కలు, తులసీ మాల ఇత్యాదివన్నిటికీ ఎన్నో వ్యాధులను నశింపచేసే శక్తి ఉందని శాస్త్రీయముగా నిరూపించారు. అయితే అన్ని వ్యాధులకన్నా గొప్ప వ్యాధి సంసార వ్యామోహం అని దానిని పోగొట్టి మోక్షమును ప్రసాదించేవాడు శ్రీమన్నారాయణుడనీ, ఆ శ్రీమన్నారాయణుని పరమ పవిత్ర ప్రసాదమే తులసీ అనీ తెలిసిన ఋషులు, వేద వేదాంతజ్ఞులు, ఆళ్వారులు భావిస్తారు. ఈ తులసీకి పర్యాయపదము హరిప్రియ మాహాత్మ్యాన్ని పలు చోట్ల వర్ణించారు.



పురాణము మరియు ప్రబంధములలో చెప్పబడిన కొన్ని విశేషాలను పరిశీలిద్దాము.

స్కాందపురాణాన్తర్గతముగా

భక్త్యా సంపూజితో నిత్యం
తులస్యాస్తు దళార్ధతః।
స్వయం ప్రత్యక్షమాయాతి
భగవాన్ హరిరీశ్వరః॥

భక్తితో కనీసము తులసీ దళములో సగభాగముతోనైననూ భగవంతుని పూజించినచో, అట్టి వానికి సర్వేశ్వరుడగు శ్రీమన్నారాయణుడు స్వయముగా సాక్షాత్కరించును.

యద్గృహే తులసీకాష్ఠమ్
పత్రం శుష్కమథార్ద్రకం।
భవంతి తద్గృహేనైవ
పాపం సంక్రమతే కలౌ॥

కలియుగములో ఎవని ఇంటిలో ఎండిన తులసీ కట్టె కానీ, ఎండిన దళము కానీ, లేక పచ్చిది కానీ ఉండునో ఆ గృహములో పాపము సంక్రమించదు.

పెరియాళ్వార్ (విష్ణుచిత్తులు) అనుగ్రహించిన తిరుప్పల్లాండు అనే ప్రబంధములో (తొమ్మిదవ పాశురం)

"తొడుత్త తుళాయ్ మలర్ శూడిక్కళైన్దన శూదుమిత్తొణ్డర్గళోం"

ఓ స్వామీ! నీవు ధరించి విడిచిపెట్టినటువంటి మాలికగా కూర్చబడ్డ తులసీమాలలను ధరించే దాసభూతులమైన మేము నీకు మంగళాశాసనం చేస్తాము అని అంటారు. ఇక్కడ స్వామి ధరించి విడిచిన తులసీ మాలను పరమపవిత్రమైన ప్రసాదముగా స్వీకరించుట అనేది దాసుల లక్షణముగా వర్ణిస్తున్నారు పెరియాళ్వార్లు. ఎలాగైతే తులసీ ఎప్పుడు స్వామి వారి పాదములను ఆశ్రయించి ఉంటుందో, ఎలాగైతే శ్రీదేవి భూదేవి నీళాదేవి ఎల్లపుడు స్వామి పాదాలను ఆశ్రయించి ఉంటారో అలా ఎప్పటికైనా మనం స్వామి పాదాలను ఆశ్రయించి ఉజ్జీవించవలసినదే అనే గొప్ప భావం

# శ్రీతులసీ మహిమ

ప్రకటితమవుతుంది.

నమ్మాళ్వార్లు అనుగ్రహించిన తిరువాయ్ మొళి ప్రబంధంలో (నాల్గవ పత్తు, ఆరవ దశకం, మూడవ పాశురం)

"మతువార్ తుళాయ్ ముడి మాయప్పిరాన్ కళల్ వాళ్ త్తినాల్"

భగవంతుని అనంత కళ్యాణ గుణాలను ప్రత్యక్ష దర్శన సమానాకారముగా (మానసికముగా) అనుభవిస్తారు నమ్మాళ్వార్లు. అంటే ఆయా కాలములలో భగవంతుడు ఏయే లీలలు చేశాడు, ఆయన శుభమైన గుణములు, స్వామియొక్క సుందరమైన, అతిశయమైన (ఇంకెవ్వరికి లేనటువంటి) దివ్యమంగళ విగ్రహమును అనుభవిస్తున్న దశకు సంశ్లేషము అని పేరు. అలా అనుభవించి ఆ స్వామిని ఒక్కసారి కౌగిలించుకోవాలి అని, ఆయన పాదములను స్పృశించాలని అనుకున్నపుడు ఇంద్రియముల ద్వారా అనుభవించలేని స్థితి కలగటం, ఆస్వామి దర్శనం కాకపోవటం వల్ల ఆళ్వార్లు పడే బాధకు విశ్లేషము అని పేరు. అంతకుముందు దశకంలో నమ్మాళ్వార్లు నాయికా భావాన్ని పొంది స్వామి కళ్యాణగుణాల్ని అనుభవించినది.

**అనన్య ప్రయోజకులైన శ్రీవైష్ణవ స్వాముల తిరుమాళిగలో అర్చామూర్తికి అలంకరించిన తులసీ వాసన కాస్త చూపించండి!**

ఈ తీర్వారై అనే దశకంలో (4.6) నమ్మాళ్వార్ అనే నాయిక విశ్లేషము వలన మూర్ఛపోయినది. అట్టి స్థితిలో నాయిక యొక్క చెలికత్తె అంటున్న మాటలేమిటంటే ఈ అమ్మాయిని (నమ్మాళ్వార్ నాయికకు) రక్షించుకొనుటకు మీరు తగని పనులు చేయకండి (దేవతాంతరములను ఆశ్రయించటం, ఇంకా ఏవో ఏవో నాటు వైద్యము లాంటివి...). ఇప్పుడు ఈ నాయిక మూర్ఛనుండి తేరుకోవాలంటే ఏ స్వామి వైభవం వల్ల ఈమెకు ప్రీతి ఉన్మస్తకమై (చాల ఎక్కువ స్థాయి) మూర్ఛిల్లిందో అట్టి స్వామి ఎల్లపుడు కిరీటంలో తేనెను స్రవించే తులసీ మాలలు కల కిరీటమును ధరించి ఉండే గొప్ప ఉపకారకుడు మరియు ఆశ్చర్యచేష్టితములు కలవాడు అలాంటి వాడిని మంగళాశాసనం చేయండి. అని సెలవిస్తూ ఉన్న సందర్భం.

అపుడు వ్యాఖ్యాతలు చెప్పిన తీరు ఏమిటంటే ఈమె మూర్ఛనుండి తేరుకోవాలంటే అనన్యప్రయోజకులైన (శ్రీమన్నారాయణుడే ప్రయోజనం తప్ప ఇంకొక ప్రయోజనం ఆశించనివారు) శ్రీవైష్ణవ స్వాముల తిరుమాళిగలో అర్చామూర్తికి అలంకరించిన తులసీ వాసన కాస్త చూపించండి, అప్పుడు తేరుకుంటుంది అని. తులసీ దొరకనిచో, ఎండిన ఆకు గానీ, కట్టె కానీ, లేదా చివరకు కాస్తంత తులసీ పాదులోని మట్టికానీ తీసుకువచ్చి ఈమెకు వాసన చూపండి అని చెలికత్తె అంటుంది. దీన్నిబట్టి తులసీ యొక్క ఈ భాగమైనా సరే... అత్యంత పవిత్రం అని మనకు అర్థమవుతుంది.

"అనేన మంత్రితాం మృత్స్నాం తులసీ మూల సంస్థితామ్
లలాటే తిలకం కృత్వా" అని (సుదర్శన కవచం ఫల శృతి) తులసీ వృక్ష మూల మృత్తిక పవిత్రత చెప్పబడింది

ఇక కార్తీక శుద్ధ ద్వాదశి రోజున కొందరు తులసీ వివాహం అని చేస్తూ ఉంటారు. ఇక్కడ వివాహం అంటే పాంచభౌతిక శరీరములతో మనలాంటి వాళ్ళు జరిపించుకునే వివాహ ప్రక్రియ కాదు. తులసీ మన జీవాత్మకు ప్రతీక. "స్త్రీప్రాయమితరం సర్వం" అంటోంది శ్రీవిష్ణు పురాణం. అంటే ఆ శ్రీమన్నారాయణుడొక్కడే పురుషోత్తముడు మిగిలిన జగత్తులోని జీవులందరు స్త్రీ సమానులే అని. అట్టి జీవాత్మలైన మనము ఏనాటికైనా ఆచార్య సమాశ్రయణమునొంది ఆ దివ్యధామునికి శరణాగతి చేసి చివరకు ఆ పరమాత్మనే పొందవలెను అనే గొప్ప రహస్యము దాగి ఉన్నది.

తులసీ మాలను ధరించుట వలన శరీరములో విద్యుచ్ఛక్తి సమన్వయం అవుతుంది. నిత్య ఆరాధనలో వినియోగించే తీర్థమును పవిత్రము చేసేది తులసీ. ఉపచారములలో భాగముగా నివేదించే ప్రసాదమునకు పవిత్రత చేకూర్చేది తులసీ. ఇలా ఎన్నో ఎన్నో విశేషాలు గల తులసీ మహాత్మ్యమును ఎవరు వర్ణించగలరు. భక్తి శ్రద్ధలతో మనందరం చిన్నదో పెద్దదో ప్రతి ఇంటా ఒక తులసీ వనమును ఏర్పాటు చేసుకుందాము. భగవత్ ప్రీతికరమైన శ్రీతులసీ సర్వశ్రేష్ఠమైనది. ప్రతినిత్యము ఆ శ్రీమన్నారాయణుని పాదపద్మములను తులసీతో అర్చిద్దాము. సకల సౌభాగ్యములు పొందుదాము. ★




# కృష్ణం వందే జగద్గురుం

"సత్త్వానురూపా సర్వస్య శ్రద్ధా భవతి భారత।
శ్రద్ధామయో2యంపురుషో యోయత్ శ్రద్ధః స ఏవ సః॥"

తాత్పర్యము: అర్జునా! మానవులందరికీ వారివారి స్వభావాన్నిబట్టి శ్రద్ధ కలుగుతుంది. శ్రద్ధలేనివాడంటూ లేడు. ఎవడికి ఎలాంటి శ్రద్ధ వుంటుందో వాడు అలాంటివాడే అవుతాడు.

"బ్రాహ్మణక్షత్రియవిశాం శూద్రాణాంచ పరంతప।
కర్మాణి ప్రవిభక్తాని స్వభావ ప్రభవై ర్గుణైః॥"

తాత్పర్యము: పరంతపా! బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులకు వారి వారి స్వభావంవల్ల కలిగిన గుణాలనుబట్టి కర్మలు విభజించబడ్డాయి.

బుద్ధిమంతులు, జ్ఞానార్జన యందు అభిరుచి కలవారు, సాత్వికులు బ్రాహ్మణులుగా నేతృత్వ సామర్థ్యము కలిగి దేశ పాలన, రక్షణయందు ఆసక్తి చూపువారు రజోగుణ సంపన్నులు క్షత్రియులుగా కృషి, గోరక్ష, వాణిజ్యమునందు అభిరుచి మరియు సామర్థ్యము కలిగినవారు వైశ్యులుగా ఇతరులు పై మూడు వర్గాలవారికి సహాయకులుగా పేర్కొనబడ్డారు. ప్రాచీన సమాజంలో సామాజిక సామరస్యము, వర్ణవ్యవస్థ ఆధారిత పటిష్ఠమైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థతో దేశము సకల సంపదలతో సమృద్ధిగా ఉండేది.

ఆధునిక సమాజమునందు ఈ పద్ధతి అంతరించుటచే సామరస్యము లేకుండా పోయింది. కులము, మతము రాజకీయాంశములుగా మారి సమాజము దినదినము దిగజారిపోతున్నది.

పారిశ్రామికీకరణచే ఉద్యోగావకాశాలు పెరిగినా నిరుద్యోగము కూడా పెరిగిపోతున్నది. పట్టణాధారిత ఆర్థిక వ్యవస్థగా మార్పుచెందినది. పర్యావరణము దెబ్బతింటున్నది. కులవృత్తులు నశించిపోతున్నాయి. పర్యావరణమునకు ప్రతికూలమైన ఆధునిక ఆర్థిక వ్యవస్థతో మానవ మనుగడకే ముప్పు వాటిల్లుతున్నది. వర్ణ సాంకర్యముచే కుల, జాతి ధర్మముల ఆచరణ లోపించి సనాతన ధర్మమునకు ముప్పు వాటిల్లుచున్నది.



"దోషైః ఏతైః కులఘ్నానాం వర్ణసంకర కారకైః।
ఉత్సాద్యంతే జాతి ధర్మాః కులధర్మాశ్చ శాశ్వతాః॥"

కులాన్ని నాశనంచేసే వాళ్ళమూలంగా కలిగే వర్ణ సాంకర్యం కారణంగా శాశ్వతాలైన జాతిధర్మాలూ, కులధర్మాలూ అడుగంటిపోతాయి.

**శ్రీమాన్ ఆచి వేంకట పాండురంగాచార్య**

ధర్మము రక్షించబడితేనే సమాజము రక్షించబడుతుంది. "ధర్మో రక్షతి రక్షితః" యుద్ధారంభమున అర్జునుని మానసిక స్థితి నేటి సమాజము నందు నిత్యజీవనములో సామాన్య మానవుని మానసిక స్థితితో పోలియున్నది. ఆసురీ ప్రవృత్తి లక్షణములైన అజ్ఞానము, మోహము, శోకము, ధర్మాధర్మ వివేచనా రాహిత్యములతో (విచక్షణ లేకుండా) స్వధర్మాచరణ లేకుండ భయావహమైన పరధర్మాచరణతోనే మానవుడు జీవనము గడుపుతున్నాడు.

ప్రతీ మానవుడు తమతమ విధ్యుక్త ధర్మమును చక్కగా ఆచరించిననాడే సమాజము అభివృద్ధి చెందుతుంది. సంసారియైన మానవునికి అర్జునుడు ప్రతీక. అర్జునునివలె మానవుడు తత్వ విచారము, తత్వబోధ చేసినప్పుడే ఉజ్జీవించగలడు. మానవుని ఇహలౌకిక అభ్యున్నతికి, పారలౌకిక ఉజ్జీవనమునకు భగవద్గీత మార్గదర్శకము.

"సారథ్యం అర్జునస్యాజౌ కుర్వన్ గీతామృతం దదౌ।
లోకత్రయోపకారాయ తస్మై కృష్ణాత్మనే నమః॥"

లోకత్రయ ఉపకారకమైన గీతామృతమును అర్జునునకు సారథ్యము వహిస్తూ కృష్ణపరమాత్మ అనుగ్రహించాడు.

(వచ్చే సంచికలో మరికొంత తెలుసుకొందాము) ★

# కార్తీక మాస వైభవము

ప్రత్యేకం



**శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి,** స్థానాచార్యులు
శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భద్రాచలం

శ్రియః పతియైన శ్రీమన్నారాయణుడు భక్తపరతంత్రుడై, భక్తికి కట్టు బడుతాడనే విషయమును నిరంతరము గుర్తుచేయు భగవన్నామము "దామోదర" నామము. అట్టి భక్తసులభుడగు దామోదరుని ప్రీతికరమైన మాసము కార్తీక మాసము.

కృత్తికా నక్షత్ర యుక్తమగు పూర్ణిమ గల మాసము కావున ఈ మాసమునకు కార్తీకమాసమనే పేరు ఏర్పడింది. కృత్తికా నక్షత్రము అగ్ని దేవతాకము. "కృత్తికా నక్షత్రమగ్నిర్దేవతా" అని వేదం తెలుపుతున్నది. కావున ఈ మాసంలో అగ్న్యారాధనాత్మకమైన దీపారాధనకు ప్రశస్తి ఏర్పడినది.

కార్తీకమాసంలో తీర్థ స్నానం విశేషంగా చేయతగినది. పద్మపురాణంలో "తులా మకర మేషేషు ప్రాతః స్నానం విధీయతే" తులా మకర మేష మాసములలో (సౌరమానం ప్రకారం రాశులను మాసాలుగా పరిగణిస్తారు) ప్రాతః కాలంలో తీర్థ స్నానం చేయటం విధి. ఇక్కడ కార్తీకమాసం లోనే తులామాసం కూడా (సౌరమానం ప్రకారం) కలిసి ఉంటుంది. అందువల్ల కార్తీక-తులా మాసములలో తీర్థ స్నానం విశేషంగా ఆచరించదగినది. కార్తీక స్నానం చేసేటప్పుడు

"కార్తికేऽహం కరిష్యామి ప్రాతః స్నానం జనార్దన।
ప్రీత్యర్థం తవ దేవేశ దామోదర మయా సహ॥"

'ఓ దామోదర! జనార్దన! దేవేశ! నీ ప్రీతి కొరకై, అలాగే లక్ష్మీదేవితో కూడిన నీ ప్రీత్యర్థముగా కార్తీకమాసమందు ప్రాతఃస్నానము తీర్థమునందు చేస్తాను" అని ప్రార్థించి తీర్థస్నానము చేయవలెనని పద్మపురాణ వచనము.

అదేవిధంగా కార్తీక మాసంలో ప్రాతఃస్నానము చేయుట వల్ల సూర్య-చంద్ర గ్రహణ సమయంలో స్నానం చేసిన ఫలితం కలిగి, విపుల భోగములను పొందుతారని వాయు పురాణం.

"యదీచ్ఛేత్ విపులాన్ భోగాన్ చంద్ర సూర్య గ్రహోపమాన్
కార్తికం సకలం వ్యాప్య ప్రాతః స్నాయీ భవేన్నరః" అని పేర్కొన్నది. అలాగే గరుడపురాణం

"గవా మయుత దానేన యత్ ఫలం లభతే ఖగ।
తులసీ పత్రకైకేన తత్ ఫలం కార్తికే స్మృతమ్॥"

"ఓ గరుడ! కొన్ని వేల గోవులను దానం చేయుట వల్ల కలిగే ఫలితం, కార్తీకమాసంలో విష్ణువునకు ఒక్క తులసీ పత్రమును సమర్పించుట వల్ల, పొందవచ్చు" అని కార్తీకమాస వైశిష్ట్యాన్ని తెలిపింది. విష్ణ్వాలయాలలో దీపమును ఈ కార్తీకమాసంలో సమర్పించినచో కలిగే ఫలాన్ని బ్రహ్మాండపురాణం

> **శమ-దమాది సాధనములచే గొప్ప జ్ఞానము కలిగి, ఆ జ్ఞానము ద్వారా పొందబడు భగవంతుడు దామోదరుడు.**

"విష్ణు వేశ్మని యో దద్యాత్ కార్తికే మాసి దీపకమ్।
అగ్నిష్టోమ సహస్రస్య ఫలమాప్నోతి మానవః॥" అంటూ, కార్తీకమాసంలో విష్ణ్వాలయాలలో దీప సమర్పణం చేసినచో వెయ్యి అగ్నిష్టోమ యాగములు చేసిన ఫలమును మానవుడు పొందుతాడని పేర్కొన్నది. దీప సమర్పణం చేసేటప్పుడు ఉచ్చరించవలసిన మంత్రాన్ని

"దామోదరాయ నభసి తులాయాం లోలయా సహ।
ప్రదీపన్తే ప్రయచ్ఛామి నమోऽనన్తాయ వేధసే॥"

"తులారాశిలో సూర్యుడున్న కార్తీక మాసమున, లక్ష్మీదేవీ సహితుడైన సర్వ జగత్కారణభూతుడు-అనంతుడు ఐన ఓ దామోదరా! నీకు ఈ దీపమును సమర్పిస్తున్నాను" అని చెప్పుతూ సమర్పించమని చెప్పింది శాస్త్రం.

బ్రహ్మ పురాణంలో

"ఏకాదశ్యాదిషు తథా తాసు పంచసు రాత్రిషు।
దినే దినే చ స్నాతవ్యం శీతలాసు నదీషు చ॥"

"వర్జితవ్యా తథా హింసా మాంస భోజన మేవచ" ఏకాదశి

(శుద్ధ) నుండి పూర్ణిమ వరకు ఐదురోజులు పుణ్యనదీ స్నానము చేయవలెను. హింసను అభక్ష్య భక్షణమును విడువవలెనని" ఉన్నది.

ఆయా పురాణములు, ప్రధానంగా ఈ కార్తీకంలో సూర్యోదయాత్ పూర్వమే స్నానం చేయుట, ఆలయములలో దీపారాధన చేయుటవంటివి అత్యంత ఫలప్రదములుగా చెప్పాయి. ఈ మాసానికి అధిపతి 'దామోదరుడు' కావున మనం చేసే పుణ్యకార్యములన్నీ దామోదర ప్రీతికరములు అవుతాయి.

శ్రీమన్నారాయణుని చతుర్వింశతి (24) వ్యూహ మూర్తులలో పన్నెండవ మూర్తికి 'దామోదరుడు' అని పేరు. 'దమ' మనగా తపస్సు అని, క్లేశములను అనగా కష్టములను సహించుట అని అర్థం చెప్తారు. అనగా బాహ్యేంద్రియములను నిగ్రహించుటకే 'దమ' మని అర్థము. 'శమ' మనగా అన్తరింద్రియ నిగ్రహము. ఈ శమ-దమాది సాధనములచే గొప్ప జ్ఞానము కలిగి, ఆ జ్ఞానము ద్వారా పొందబడు భగవంతుడు దామోదరుడని పిలువబడుతాడు.

'దామ' అంటే తాడు. ఆతాటిచే కట్టుబడిన వాడు కావున దామోదరుడు. అతడే కృష్ణుడు. యశోద వెన్నదొంగయైన కృష్ణుని తాట కట్టి వేసినందువల్ల, ఆమె ప్రేమ అనే తాటికి కట్టుబడిన వాడైన సర్వేశ్వరుని పరమ సౌలభ్యగుణమును ఆవిష్కరించు పవిత్ర నామమీ దామోదర నామము.

"దామాని లోకనామాని తాని యస్యోదరాన్తరే।

తేన దామోదరో దేవః శ్రీధరస్తు రమాశ్రితః॥" అని "సకల లోకములకు దామములని పేరు. ఆ లోకములన్నీ లక్ష్మీపతియైన ఏ శ్రీధరుని ఉదరములో ఉన్నాయో, ఆ లోకములను తన ఉదరంలో భద్రంగా ఉంచుకొని కాపాడు వానికి 'దామోదరుడ'నే పేరు కలిగిందని" పై నిర్వచన శ్లోకానికి అర్థం.

ఈ పవిత్ర కార్తీకంలో తులసీ దళాలతో శ్రీమన్నారాయణుని పూజించుట సకల శ్రేయస్సులను కలుగజేస్తుంది. ఈ మాసంలో తులసీ-ధాత్రీ కల్యాణం చేయటం కొన్ని చోట్ల ఆచారంగా ఉంది. 'ధాత్రి' అంటే ఉసిరి చెట్టు. ధాత్రీ నారాయణుడనే వ్యవహారం ఉంది. తులసి చెట్టుకు ఉసిరి చెట్టుతో కల్యాణం చేయటం అత్యంత పుణ్యప్రదమని పురాణ వచనం. పై పురాణ ప్రామాణములను అనుసరించి, ఈ మాసంలో నదీ సముద్రాది పవిత్రస్నానములు శివ-కేశవాది క్షేత్రములలో దీపారోపణము, శ్రీమహావిష్ణువునకు తులసీ దళార్చనము, శివునకు అభిషేకములు, నిరంతరం శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణములు, శ్రీమద్భగవద్గీతా పఠనము వంటి పవిత్ర కర్మలన్నీ ఈ మాసంలో ఆచరించినచో తద్వారా పరమపురుషుడగు దామోదరునికి ప్రీతిని కలిగించిన వారమై లోక కల్యాణ కారకులము కాగలము. ★

# భాగవతంలో భగవంతుని అవతార గాథలు

(14 వ పేజీ తరువాయి)


పరమదైవతమైన విధం తెలిపి అనుగ్రహించాడు.

"మరి ఒకప్పుడు, నేను వెలుగుతున్న ఏడువేల విమానాల్లో ఒకదాన్ని ఎక్కి, విహరిస్తున్నాను. ఎన్నో వేలమంది స్త్రీపురుషులు నన్ను కొలుస్తున్నారు. పలువురు రాజులు నా అనుగ్రహంతో శివ పూజలు చేశారు. నేను దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేస్తూ ఉన్నాను. నా ఇంటికి ద్వారపాలకులుగా కైలాసవాసులు, పాతాళవాసులు, అంతరిక్షంలో సంచారులు, స్వర్గవాసులు, మొదలైన సకలజీవులూ ఉన్నారు. మేరుపర్వత మంత ఎత్తున్న ప్రమథగణాలతో కలిసి, నేను మహాదేవారాధన చేశాను. నా తండ్రి బ్రహ్మదేవుడు ప్రత్యక్ష మైతే, ఆయన ద్వారా నేను, ఆత్మదర్శనం, ఈశ్వరదర్శనం చేసుకొనే ఉపాయాలు తెలుసుకొన్నాను. తద్ ద్వారా పరమేశ్వరుని సాక్షాత్కారం పొందాను. ఆయన ఆజ్ఞ మీదే ఇప్పుడిక్కడికి వచ్చి మీ అందరికీ శివమహత్త్వం బోధించాను."

ఈ విధంగా చెప్పి, వారందరినీ ఆత్మజ్ఞానులను చేసి వెళ్లాడు, సనత్కుమారుడు. సనత్కుమారుని గృహ వాస్తుశాస్త్రం ఒకటి ప్రచారంలో ఉంది. ఇందులో చాంద్ర సౌరమాన ఫలాలు, ద్వార నిర్ణయం, వార నక్షత్ర ఫలాలు, శంకుస్థాపన, తదితర విషయాలు ఉన్నాయి. ఇదే విధంగా సనత్కుమార శిల్పశాస్త్రం పేరిట ప్రచారంలో ఉన్న గ్రంథం ద్వారా, విశ్వకర్మ మతాన్ని అనుసరించిన గృహోపకరణాల లక్షణాలు, గృహనిర్మాణ ఆరంభ శుభాశుభ తిథి వార నక్షత్రాలు, మొదలైన సంపూర్ణ గృహనిర్మాణ విషయాలు కూడా తెలుస్తాయి. మన మహర్షులు కేవలం ఆముష్మిక విషయాలకే కాకుండా, ఐహిక విషయాలను కూడా వదిలిపెట్టలేదు అనటానికి ఈ గ్రంథాలే నిదర్శనం. (సశేషం) ★

# జ్యోతిర్విజ్ఞానమ్

## శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక



ఆయుర్వృద్ధి ఎలా కలగాలి? అంటే అదే నీతి శాస్త్రంలో తెలిపారు. బాలార్కో బదులుగా

"వృద్ధార్కో హోమ ధూమస్య
బాలాస్త్రీ నిర్మలోదకం
రాత్రౌ క్షీరాన్న భుక్తస్తు
ఆయుర్వృద్ధిం దినే దినే" అస్తమించే సూర్యునికి ఎదురుగా నిలబడండి. దివ్యమైన ఓషధుల చేత వ్రేల్చే, వేదమంత్రాల ద్వారాచేసే హోమం ద్వారా వచ్చే పొగ ద్వారా మీ శరీరానికి మీ పరిసరాలకూ, ప్రాంతానికీ ఆ పొగ సోకాలనీ, వయసులో చిన్నదైన స్త్రీని వివాహం చేసుకొమ్మని, సూర్యరష్మి సోకే నిర్మలంగా ప్రవహించే జలాన్ని త్రాగటం, స్నానం చేయటం, రాత్రివేళ క్షీరాన్నం అనగా పాలతో అన్నం తింటే ప్రతిదినమూ ఆయుర్వృద్ధి కలుగుతుంది అని భావం. కానీ ఇప్పుడు ఏం జరిగింది? బలార్కుడా, వృద్ధార్కుడా తెలియదు. ఎటువంటి స్త్రీని వివాహమాడాలో తెలియదు. సూర్యరష్మి సోకని బోరింగ్ నీళ్ళు త్రాగుతున్నాము. దీని వలన రోగాలు సంభవిస్తున్నాయి. మనవారు పెద్దల ద్వారా తెలుసుకొని శాస్త్రీయమైన జీవితాన్ని గడిపి, శాశ్వతమైన ఆయురారోగ్య కీర్తి భోగ భాగ్యాలు పొందారు. అది శాస్త్రీయమైన జీవన విధానమే. అందులో ఒక భాగమే ఈ వాస్తుశాస్త్రం! ఈ వాస్తు శాస్త్రంలో మొదలు ప్రకృతిని గురించి తెలుపబడుతుంది.

అంటే ప్రతి మానవుడు పరిసర ప్రాంతాలలో ఉండే వనాల్లోకానీ అరణ్యాల్లో కానీ సంవత్సరంలో ఒక్క మాస మయినా వెళ్ళి తిరిగి రావాలనే పద్ధతి ఉండేది. ప్రాచీనులు కార్తీక మాసంలో శ్రావణ మాసంలో ఇతర పుణ్య మాసాల్లో వనభోజనాలు, వనములలో విహరించటం కానీ చేసేవారు. చాతుర్మాసంలో వనంలో కూర్చొని ధ్యానం చేయటం ద్వారా ప్రకృతిలో ఉండే గాలి సోకి పాకి చక్కని ఆరోగ్యం,ఆయుశ్శు పెరుగుతుంది. ప్రధాన ఐశ్వర్యం సంతోషమే కనుక ఐశ్వర్యం కూడా పెరుగుతుంది. జీవితం అభివృద్ధి పంథాలో నడుస్తుందనే ఉద్దేశంగా వనాలనూ రక్షించేవారు. ప్రాచీన కాలంలో ప్రాంతాలను, విస్తీర్ణాలను బట్టి పెద్ద అడవులు ఉండేవి. గ్రామాల్లో వనాలే గాక ప్రతి గృహంలో ఉన్నంతలో చెట్లను కొట్టకుండా ఇండ్లు కట్టే వారు. వృక్ష పరిరక్షణ చేశారు. మట్టి కూడా కలుషితం కాకుండా గోమయంతో కళ్ళాపు జల్లి ముగ్గులు వేసి భూమి శక్తిని పెంచే స్థితిని ప్రాచీనులు నిత్య జీవితంలో పెట్టుకున్నారు.

గాలిని కూడా కలుషితం కానీయకుండా ఆ గాలిని యంత్రాలతో కాకుండా విసన కర్రలతో విసురుకునేవారు. అవి కూడా ప్లాస్టిక్ వంటివి కాకుండా వెదురు వంటి వాటితో సహజ సిద్ధంగా తయారు చేసే వారు. గృహప్రవేశాల్లో వేదమంత్రాలతో అగ్ని హోత్రాన్ని అరణి ద్వారా ప్రతిష్ఠించుకొని ఆరాధన సాగించేవారు. గాలి గూడు అనబడే గుంటలో ఆ అగ్ని హోత్రం పెట్టుకునే వారు. ఆ అగ్నిని కాపాడేవారు. ఎవరి ఇంట్లో నయిన అగ్నిహోత్రం చల్లారితే అశుభంగా భావించేవారు.

మళ్ళీ అగ్ని హోత్రం కావాలంటే ఎవరింట్లో అయితే సత్సాంప్రదాయం, సదాచారం, సత్సంతానం, అన్యోన్యత అభివృద్ధి ఉంటుందో వారింటికి వెళ్ళి ఆ గాలి గూట్లోంచి మంచిరోజు అగ్ని హోత్రాన్ని నిప్పురవ్వను తెచ్చుకొని గాలి గూట్లో వేసుకొని అగ్నిహోత్రాన్ని సంరక్షించేవారు. అలా గృహానికి ఆగ్నేయంగా అగ్నిని, ఈశాన్యంలో బావి, వాయవ్యంలో పెంట. నైఋతిలో బరువైన వస్తువులు పెట్టుకొని భూమండలం ఉన్నట్లుగా సమతౌల్యంగా ఉంచుకొని ఆ విధానంలో సక్రమమార్గంలో సుఖ సంతోషాలతో జీవించేవారు.

కట్టడాల్లో కూడా రాళ్ళను పగుల గొట్టాలంటే సాలిగ్రామలలాగా వాటిని గౌరవించి విచ్ఛిన్నం చేయటానికి పద్ధతులు పాటించేవారు. వాసాలు వేసుకొని మట్టితోనే గృహాన్ని నిర్మించుకునేవారు. కొండలు కొట్టి స్వార్థం కొరకు ముక్కలు చేసేవారు గాదు. అందువల్ల వారు ఆనందంగా

# జ్యోతిర్విజ్ఞానమ్

ఉన్నారు.

నేటికాలం కొండలను పిండి చేసి గ్రైనెట్ పేరుతో వాడుకోవటం, విదేశాలకు పంపటం చేస్తున్నారు. విదేశీయులు వారికున్న ప్రకృతి సంపదలు కాపాడు కుంటున్నారు. మన ప్రాచీనులు, రాయికి రప్పకు, నీటికీ మట్టికీ అగ్నికీ ఇలా అన్నిటికీ ప్రాధాన్యతనిచ్చారు. అంతేకాదు మాటకూ చేతకూ కూడా ప్రాధాన్యతనిచ్చారు.

ప్రాంతాల మధ్యలో అడవులు, గ్రామ సమీపంలో చిట్టడవులు, గ్రామం మధ్యలో వనాలు ఇండ్లల్లో వృక్షాలు చెట్లు ఉండేవి. సహజమైన ఆరోగ్యాన్ని ఇచ్చేవి చెట్లు. ఆయుర్వేదంలో కూడా చెట్ల కుండే ఆకులు వేర్లు బెరళ్ళు కొమ్మలు ఇలా అన్నింటితో అనేక ఔషధాలు వైద్యులు తయారు చేస్తారు. చెట్టు కుండే ప్రతి భాగమూ ఉపయోగ పడుతుంది తులసీ చెట్టుకు నీరుపోసి ఆనీటిని కొంత తీర్థంలా తీసుకునేవారు. తులసిలో 64 రకాల ఔషధ గుణాలు ఉంటాయి. తులసిచెట్టును తడుపుతూ ఉంటే దాని మూలంలో మట్టి కూడా ఔషధ గుణాలు సంతరించు కుంటుంది. తులసి మొక్క దగ్గర రోజు ఒక అరగంట కూర్చొని మంచి విషయాలు మాట్లాడటం, ఆస్తికులయితే భగవధ్యానం చేయటమో, ముచ్చటించటమో జరిగితే ఆ చెట్టు నుండి వచ్చేగాలి మన శరీరానికి సోకి ఆయుర్వృద్ధి యశో వృద్ధి కలుగుతుంది.అని తులసి మహాత్యంలో చెబుతారు. భగవంతుని ఆలయంలో కూడా తీర్థంలో తులసీ దళం వేసి " అకాల మృత్యు హరణం" సర్వవ్యాధి నివారణం సర్వదురితహరం" అనిమంత్రం చదివి తీర్థం తీసుకుంటారు. ఇలా వృక్షాల నుండి అనేక ఫలాలు పొందవచ్చు. ఎటువంటి చెట్లు ఏయే చెట్లు ఎక్కడెక్కడ పెట్ట వచ్చు అనే అంశాలు కూడా అలంకార వాస్తులో తెలుసుకుంటాము.

**(మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో)** ★

# యజ్ఞవరాహ క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు



సర్వవైదిక 'సంస్థానం ట్రస్ట్ యాజ్ఞవరాహ క్షేత్రం, కరీణ్ణగరమ్‌లో శ్రీభాష్యం వరప్రసాద్, మేనేజింగ్ ట్రస్టీ ఆధ్వర్యంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 20 నుండి 25 వరకు ఏర్పాటు చేయబడ్డాయి. సూర్యప్రభ వాహనం, పూలంగి సేవ, అన్నకూటోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవ, గజవాహనం, కల్యాణోత్సవం, రథోత్సవం, శ్రీపుష్పయాగం, ఏకాంత సేవ కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సంవత్సరము రెడ్డి రమాదేవి, రాజేందర్ రెడ్డి (జర్మనీ), తూము రజిత, అశోక్‌రెడ్డి గారలు కల్యాణ మహాభోగ దాతలు. ఈ ఉత్సవాల్లో భద్రాచల వేద పండితులకు మరియు రిటైర్డ్ కాబోయే వేద పండితులకు ఘనంగా సమ్మానం చేయడం జరిగింది. ప్రతి నిత్యం సాయంత్రం శ్రీ కె.యస్. అనంతాచార్య సమన్వయంతో సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ★









# ధ్రువోపాఖ్యానం



## తిరుక్కోళూర్ పెణ్ పిళ్ళై రహస్యాలు

**తిరుక్కోళూరు పెణ్ పిళ్ళై పలికిన 81 వాక్య రత్నాలలో అందు 8 వ భాగవతుడైన ధృవుని యొక్క వృత్తాంతము.**

**"తన్దై ఎంగై ఎన్దేనో, తురువనైప్పోలే"**

(గత సంచిక తరువాయి)

తన ముందు ప్రత్యక్షమైన స్వామిని ధ్రువుడు చూడగానే అతని మనసులోని రూపం మాయమైంది. స్వామిని చూసి పులకించి సాష్టాంగ నమస్కారం చేశాడు. ముందు నిలబడ్డ ఆ భగవానుని ఎలా స్తుతించాలో తెలియలేదు తడబాటు పడుతున్నాడు ధ్రువుని ఆలోచన గ్రహించిన ఆ పద్మనాభుడు తన చేతి శంఖంతో ఆ బాలుని చెక్కిలి తాకాడు భగవత్ కృపతో సుజ్ఞానిగా మారిపోయాడు బాలుడు. వెంటనే పలు విధాల భగవానుని స్తుతించాడు.

అంత శ్రీహరి' "రాకుమారా నీ వ్రత దీక్షకు మెచ్చాను. నీ అభిప్రాయం గ్రహించాను. నీ కోరిక తప్పక తీరుస్తాను. గ్రహాలు, నక్షత్రాలు, తారాగణాలు, సప్తర్షి మండలం, జ్యోతిశ్చక్రము దేనిని ప్రదక్షిణ చేస్తుంటారో అట్టి మహోన్నతమైన "ధ్రువక్షితి" అనే మహా ఉన్నతమైన స్థానాన్ని 60 సంవత్సరాల తరవాత నీవు పొందగలవు ఇంతకుముందు ఎవరూ దానిని పొందలేదు మూడు లోకాలు నశించిన దానికి నాశము ఉండదు. ప్రకాశిస్తూ ఉంటుంది. అంతవరకు నీ తండ్రి రాజ్యాన్ని ధర్మం మార్గాన పరిపాలిస్తావు." అని ధ్రువుని కోర్కెను తీర్చి అంతర్ధానమయ్యాడు. శ్రీహరి అనుగ్రహం అందుకొని కుమారుడు తిరిగి వస్తున్న వార్తను తండ్రి చారుల వలన తెలుసుకొని ఇద్దరు భార్యలతో సహా మంత్రులతో పరివారంతో ఎదురు వెళ్లి ప్రేమతో కుమారుని కౌగిలించుకున్నాడు. భగవద్ అనుగ్రహం కలిగిన కుమారుని కౌగిలించుకొని మైమరిచిపోయాడు రాజు. తల్లి కూడా వాని స్పర్శతో ఇన్నాళ్ళ దుఃఖాన్ని మరిచిపోయింది. రాజభవనం ప్రవేశించాడు దేవేంద్రుడు స్వర్గం ప్రవేశించినట్లుగా యవ్వన వతుడు కాగా ధృవునికి పట్టాభిషేకం చేసి తపోవనానికి వెళ్ళాడు ఉత్తనపాదుడు. ధృవుడు ఇద్దరు కన్యలను వివాహం చేసుకున్నాడు. ధృవుని తమ్ముడైన ఉత్తమునికి ఒక యక్షుని చేతిలో మరణం సంభవించగా ధ్రువుడు కోపంతో యక్షుల మీద యుద్ధం ప్రకటించి 13000 మందిని అలకాపురికి వెళ్లి సంహరించాడు.

**శ్రీమతి మహాలక్ష్మీ రాణి గుండు, రాజమండ్రి.**

యక్షులంతా ధృవుని చుట్టుముట్టగా బలంతో శత్రు వీరుల శస్త్రాలను చెల్లాచెదరు చేసేశాడు. యక్షులంతా పారిపోయారు కానీ రాక్షసమాయలు ధృవుని కప్పేస్తున్నాయి అంత ధ్రువుడు శ్రీమన్నారాయణుని స్మరించి నారాయణాస్త్రాన్ని ప్రయోగించాడు.

ఈ విధంగా యక్షులను వధిస్తున్న ధ్రువుని చూసి తాతగారైన స్వయంభువ మనువు "బిడ్డ! ఆగ్రహాన్ని చాలించు! నీవు మన వంశంలో పుట్టిన పుణ్యాత్ముడవు. కుబేరుని ప్రార్థించు అనగా కుబేరుని ప్రార్థించాడు. కుబేరుడు ధ్రువుని ప్రార్థనకు సంతోషించి ప్రత్యక్షమై "జీవుల పుట్టుకకు కాలమే కారణం కర్తలన్నింటికీ సాక్షిభూతుడు భగవంతుడే నీ తమ్ముని చంపింది యక్షులు కాదు అలానే యక్షులను చంపింది నీవు కాదు" అని చెప్పి అనేక వరాలు ఇచ్చి అంతర్ధానమైనాడు. ధృవుడు రాజ్యానికి తిరిగి వచ్చి ధర్మ నిరతుడై యజ్ఞ యాగాది క్రతువులు నిర్వహిస్తూ పూజిస్తూ 66000 సంవత్సరాలు రాజ్యపాలన చేసి ఆపై తన కుమారునికి రాజ్యం అప్పగించి, బదరికా వనానికి వెళ్లాడు. కొంతకాలానికి ధ్రువుని వద్దకు ఒక దివ్య విమానం విష్ణుకింకరులు వచ్చి శ్రీమహావిష్ణువు నీకు విష్ణు పదాన్ని ఇచ్చినారు విమానం అధిరోహించండి అన్నారు. ధృవుడు రథం ఎక్కబోతూ తన తల్లిని విడిచి వెళ్తున్నందుకు విచారిస్తుండగా కింకరులు ముందు భాగంలో కూర్చున్న సునీతిని చూపుతారు. పరమానందంతో ధృవుడు తల్లితో సహా విష్ణు భక్తులు మాత్రమే చేరుకోగలిగిన దివ్య పథమైన ఆ విష్ణు పదాన్ని చేరుకున్నాడు. ఇలా ధృవుడు చేరుతున్న విష్ణుపదం కాంతిమయమై ఆ కాంతి ముల్లోకాలకు విస్తరిస్తుంది. ఈ ధ్రువ చరిత్ర అతి పుణ్యమైనది.. ★

# అష్టలక్ష్మీ వైభవం



**శ్రీమతి వంగల రాధిక**

నామ సంకీర్తనమును ఆహారంగా స్వీకరిస్తూ ఆ నామములోని భగవత్ గుణ తత్వములనే మకరందమును గ్రోలి, ఆచార్యపురుషులనే భ్రమరాలు, ఆ నామతీయదనమనే మత్తులో, కనులు మూసుకొని భగవంతుని లీలలను ప్రత్యక్షానుభూతిగా సేవిస్తూ మైమరచి పోతూవుంటే! అదే కదా ధాన్య సమృద్ధి! జీవుల ఉజ్జీవనానికి తగిన ఆహారము! అలాంటి ధాన్యసమృద్ధి పరమైన, భగవత్ గుణానుభవము లను మనకు అందించేది పిరాట్టి! అందుకే ఆవిడ ధాన్యలక్ష్మిగా మనకు సాక్షాత్కరిస్తుంది.

సంతాన లక్ష్మి

భారత దేశ ధర్మము సనాతన ధర్మము! ఇది వంశ పారంపర్యముగా కృతయుగమునుండి కలియుగ పర్యంతము ఇంకా నెలకొని వున్న దానికి కారణము మన పూర్వీకుల నుండి మనము అందుకొన్న జ్ఞాన విశేషము. సంతానము ద్వారా అలా యుగ యుగాలుగా, మన ధర్మము అభివృద్ధి చెందుతూ ప్రపంచములోని సమస్త జీవరాశులను, వుజ్జీవింప జేస్తోంది. "లోకాః సమస్తాః సుఖినో భవంతు" అన్నట్లు వర్ధిల్లాలంటే సత్ సంతానము కలగాలి. అలాంటి సత్ సంతానాన్ని అనుగ్రహించేది, మహాలక్ష్మీ పిరాట్టియే. "వామ్ నల్ మక్కళై పెఱ్ఱు మగివరే" అని పిరాట్టి మనకు మంగళాశాసనము చేస్తుంది. అట్టి కరుణామయ రూపమే సంతాన లక్ష్మి.

ఆదిలక్ష్మి, విద్యాలక్ష్మి, గజలక్ష్మి, ధైర్యలక్ష్మి, విజయ లక్ష్మి, ధనలక్ష్మి, ధాన్య లక్ష్మి, సంతానలక్ష్మి అని ఇలా అష్టవిధరూపములలో మనకు అష్టైశ్వర్యాలను అందించే పిరాట్టియే మహాలక్షి. మనలోని అలక్ష్మిని "అలక్ష్మీర్వే నశ్యతామ్" అని భగవంతుని మనము పొందడానికి అడ్డుపడే విరోధాలన్నింటిని తొలగింప చేస్తుంది లక్ష్మీ పిరాట్టి! అవి ఏమిటో తెలుసుకుందాము. స్వరూప విరోధి, దేహాత్మభావం, "దేహాసక్తాత్మబుద్ధి" దీనిని జయించడము చాలా కష్టము. పరత్వ విరోధి, దేవతాన్తర పరత్వ ప్రతిపత్తి నారాయణుని యందు నిశ్చలమైన విశ్వాసము వుంచక. దేవతాన్తర ఆశ్రయణం ఇది జయించాలి. పురుషార్థ విరోధి అన్య పురుషార్థ వాంఛలు ఐశ్వర్యాదుల యందు ఇచ్ఛ) పరమాత్మకు చేసే కైంకర్యము భగవత్ ముఖోల్లాసమునకని కాక తనకు ప్రీతికరముగా వున్నదని భావించుట,

ఉపాయ విరోధి ఉపాయాన్తర వైలక్షణ్య ప్రతిపత్తి నాచే చేయబడిందనే అహంకారము ఇది పోవడము చాలా కష్టమే స్వ ప్రవృత్తి నివృత్తిపూర్వక జ్ఞానము కలగాలి. భగవత్ కైంకర్య ప్రాప్తియే పురుషార్థమని అదీ ఆయన కృపతో మాత్రమే సాధ్యమనే జ్ఞానము ఏర్పడుట అరుదు.

ప్రాప్తి విరోధి ప్రాప్త శరీరసంబంధ అహంకారముతో, భగవత్ భాగవత అపచారములు చేయడము! మనకు దీనిని నివారించడమూ కష్టసాధ్యము!

ఇలా ఈ పంచ విధ విరోధి స్వరూపాలను జయించి, ప్రపన్నత్వము సిద్ధించాలంటే పురుష కారిణి ఐన పిరాట్టికృపతో మాత్రమే ఇది సాధ్యము! పిరాట్టి లక్ష్మీ దేవి. అష్ట విధ లక్ష్మీ రూపాలతో మనను అనుగ్రహిస్తుంది. పరమాత్మ కరుణ జయించేలా చేస్తుంది. అప్పుడే మన కర్మలు వైదొలగిపోతాయి. అప్పుడే మనకు ఈ దుఃఖ భూయిష్టమైన జనన మరణ సుడిగుండములో నుంచి విముక్తి. పరమాత్మలో నివురుగప్పిన నిప్పులా వుండే దయ గుణమును ప్రేరేపించేది పిరాట్టి! అందుకే రెండు విధములుగానూ పురుషకారముచేసి, ఈ లోక పరలోక ఐశ్వర్య ప్రాప్తిని కలిగించి మనకు విజయము సిద్ధించేలా చేస్తుంది పిరాట్టి! అటువంటి మహాలక్ష్మికి మనము సకల విధ కైంకర్యములు "వాయినాల్ పాడి, మనత్తినాల్ శిందిక్క" తూమలర్ తూవి తొళుదు సమర్పించుకొంటూ పరమాత్మ దరి చేరే భాగ్యాన్ని పొందాలి. హృదయమందు నిలుపుకొని. నోరుతెరిచి పాడి పుష్పాలు సమర్పించి ఆరాధిద్దాము. ఆళ్వారులన్నట్లు "పూమేల్ ఇరుప్పాళ్ నమ్ వినై తీర్కుమే" అని అటువంటి క్షీరాబ్ధి కన్యకకు నీరాజనం శ్రీ మహా లక్ష్మికిని నీరాజనం! ★



## శ్రీరామాయణంలో ఉపకథలు

# ధర్మసూక్ష్మం తెలిసిన శునకం



శ్రీమతి చక్రవర్తుల చూడామణి, ఖమ్మం

(గత సంచిక తురువాయి)

ఆ శునకం ఒక మంచి రాజుకు ఉండవలసిన లక్షణాలను తెలియజేసింది. అంతే కాక ధర్మం అంటే ఏమిటి? రాజు ఎందుకు ధర్మాన్ని ఆచరించాలి? అలా ఆచరించకపోతే కలిగే దుష్ఫలితాలు ఎలా ఉంటాయి? అనే విషయాలను చక్కగా చెప్పింది. ధర్మము దుష్టశిక్షణకు, శిష్టరక్షణకు సమానంగా ఉండే తిరుగులేని ఆయుధం. ధర్మాన్ని ఆచరించే వాళ్ళకు లోకంలో దుర్లభమైనది ఏది ఉండదు. దానం చేయడం, భూత దయ కలిగి ఉండడం, సత్పురుషులను గౌరవించడం, అన్ని వ్యవహారాల్లో ఋజువర్తనం కలిగి ఉండడం, అనేది ధర్మం. వాటిని ఎంతో చక్కగా నువ్వు ఆచరిస్తున్నావు. నీకు ఇవన్నీ చెప్పినందుకు నామీద కోపం తెచ్చుకోకు' అని ప్రార్థించింది.

ఈ విషయాలన్నీ శునకం రాముడికి చెప్పడం ఏమిటి? ఇవన్నీ రాముడికి తెలియనివా? అంటే శునకం పూర్వ జన్మలో ఉన్నత స్థాయిలో జీవించింది, మంచి ధర్మచారణ చేసింది. ఏదో దోషం చేయడం వలన ఈ అధమ జన్మ వచ్చింది. అందువలన శునకం రాముడికి ఇవన్నీ చెప్పి ఆయన పరిపాలనను కీర్తించింది. అంతా విని రాముడు 'నీకు వచ్చిన కష్టమేమిటో చెప్పు' అన్నాడు.

'సర్వార్థసిద్ధుడు' అన్న పేరు గల ఒక భిక్షువు, ఒక బ్రాహ్మణ గృహంలో నివసించేవాడు. నా పట్ల ఏ దోషము లేకుండా అతడు అకారణంగా నా తల పైన కొట్టాడు.' అని చెప్పింది. వెంటనే రాముడు ఆ భిక్షువును తీసుకురమ్మని ఆజ్ఞాపించాడు. సేవకులు ఆ భిక్షువును తీసుకు వచ్చారు. ఆ భిక్షువు రాముడిని చూసి వినయంగా నమస్కారం చేసి, 'పుణ్య పురుషుడా నేను చేయవలసిన కార్యమేమిటో సెలవివ్వండి' అన్నాడు. అప్పుడు రాముడు 'నువ్వు కర్రతో ఈ శునకం తలపై కొట్టావు, అలా కొట్టడానికి, ఇది నీకు చేసిన అపకారం ఏమిటి?' అని అడిగాడు. 'క్రోధం ప్రాణం తీసే శత్రువు, పైకి మిత్రునిలాగా కనపడుతుంది. ఇది చాలా పదునైన ఖడ్గం లాంటిది. సకల సద్గుణాలను హరించగలదు. మనుష్యులు ఎంతగా తపస్సు చేసినా, ఎన్నెన్ని యాగాలు ఆచరించినా, పుష్కలంగా దానాలు చేసినా, క్రోధం వలన అవి అన్నీ నిష్ఫలమైపోతాయి. అందువల్ల క్రోధాన్ని జయించాలి. దౌడు తీస్తున్న చెడ్డ గుర్రం లాగా ఇంద్రియాలు దుష్ట విషయాల వైపు పరుగులు తీస్తూ ఉంటాయి. మనోబలంతో నిగ్రహించుకుని వాటిని సరి అయిన మార్గంలో నడిపించాలి. మనసు చేత, కర్మ చేత, వాక్కు చేత, చూపుల చేత కనబడుతున్న లోకానికి శ్రేయస్సునే చేకూర్చాలి. అలాంటి వాళ్ళు ఎవరినీ ద్వేషించరు. వాళ్ళకు ఎలాంటి పాపాలు అంటవు.' అని నిష్కారణ క్రోధం వలన జరిగే అనర్థాలను కూడా తెలియజెప్పాడు

మనోనిగ్రహం లేని వాడి వలన లోకం అనేక కష్టాలను అనుభవించాల్సి ఉంటుంది. పదునైన కత్తి, దెబ్బతిని రెచ్చిపోయిన సర్పం, ఎప్పుడు కోపంగా ఉండే శత్రువు కూడా అంత క్రూరంగా హాని చేయలేరు. వినయం లేని వాడికి ఎంత శిక్షణ ఇచ్చినా దాని వలన సహజ స్వభావము మాత్రము మారదు. దుష్ట స్వభావాన్ని ఎంత కప్పి పుచ్చుకున్నా అది బయటపడుతూనే ఉంటుంది. 'అని శ్రీరాముడు చెప్పాడు. అప్పుడు ఆ బ్రాహ్మణుడు రాముడితో, 'స్వామి నేను ఒకనాడు భిక్షాటన చేస్తూ తిరుగుతున్నాను. ఆ రోజు నాకు ఏమాత్రం బిక్ష దొరకలేదు. అప్పుడు ఆకలికి తట్టుకోలేక నేను బాగా క్రోధా వేశాలకు లోనయ్యాను. ఆ స్థితిలో నేను కుక్కను కొట్టిన మాట నిజమే, నేను భిక్షాటన చేస్తుంటే ఇది కాళ్ళకు అడ్డం పడుతూ తిరిగింది. 'తొలగిపో తొలిగిపో 'అని దానిని ఎంత మందలించినా అది వెళ్ళలేదు. స్వేచ్ఛగా తిరుగుతూ అడ్డుపడుతూ ఉంది. ఆ పరిస్థితిలో నాకు చాలా కోపం వచ్చింది, నేను దీనిని కొట్టాను. రాజులకే మహారాజువైన శ్రీరామా! నా అపరాధానికి నన్ను శిక్షించు. మహాత్ముడవైన నీ చేతిలో శిక్షింపబడితే ఇక నాకు నరక భయం ఉండదు.' అని చెప్పాడు.

అప్పుడు రాముడు సభలో ఉన్నవాళ్లను ఉద్దేశించి

'సదస్యులారా! ఇతనికి ఎలాంటి శిక్ష వేయాలో చెప్పండి.' అని అడిగాడు. ఆ సమయంలో భృగువు, అంగిరసుడు, కుత్సుడు, వసిష్ఠుడు, కశ్యపుడు మొదలైన మహర్షులు సభలో ఉన్నారు. ధర్మ శాస్త్రంలో ఆరితేరిన ప్రముఖులు, మంత్రులు, పౌరులు ఉన్నారు. వాళ్ళందరూ 'యథాపరాధ దండానాం' అన్న సూక్తి తమకే తెలుసు అయినా 'బ్రాహ్మణుడికి మరణ శిక్ష వేయకూడదు' అని శాస్త్రాలు చెప్తున్నాయి' అని శ్రీరాముడితో చెప్పారు. 'రఘురామా నీకు తెలియని ధర్మ శాస్త్రం ఏముంది? నువ్వే ఏది ధర్మం అని తోస్తే అలా శిక్షించు.' అని చెప్పారు. అప్పుడు ఆ శునకం ' రఘురామా నా మీద దయ ఉంటే నాకు ఒక వరం ప్రసాదించు.' అని అడిగింది. 'నేను నీకేం సహాయం చేయాలి?' అని రాముడు అడిగాడు. మహారాజా ఈ బ్రాహ్మణుని కులపతిగా చేయండి, అంటే మఠాధిపతిగా చేయండి, అందునా 'కౌలంచన మఠానికి అధిపతిగా చేయండి.' అని అడిగింది. వెంటనే శ్రీరాముడు ఆ మఠానికి ఈ బ్రాహ్మణుడిని అధిపతిగా చేశాడు. ఎలాంటి శిక్ష పడుతుందో అని భయపడిన సర్వార్థసిద్ధుడు ఇలా సన్మానింపబడటంతో చాలా సంతోషంగా గజారోహణ చేసి వెళ్ళిపోయాడు.

తర్వాత మంత్రులు ఆశ్చర్యపడుతూ మహా తేజస్వి అయిన రాముడిని చూసి 'ఈ బ్రాహ్మణుడిని శిక్షించడానికి బదులుగా వరాన్ని ఇచ్చావు. మఠానికి అధిపతిగా చేశావు. అది శిక్ష ఎట్లా అవుతుంది?' అని అడిగారు. దానికి రాముడు ' మీకు నీతి శాస్త్రం యొక్క లోతుపాతులు బాగా బోధపడినట్లు లేదు. ఆ బ్రాహ్మణుని మఠాధిపతి చేయటంలో అంతరార్థం ఈ శునకానికి బాగా తెలుసు అని చెప్పాడు.

అప్పుడు ఆ శునకం తన కథను ఇలా చెప్పింది. ' నేను పూర్వ జన్మలో కౌలంచన మఠానికి కులపతిగా ఉన్నాను. అప్పుడు నేను యజ్ఞ శిష్టాన్నాలను భుజిస్తూ ఉండేవాడిని. దేవతలను, భూసురులను పూజించడంలో చాలా జాగ్రత్తగా, శ్రద్ధగా ఉండేవాడిని. దేవతా ప్రసాదాలను దాస దాసీ జనాలకు సముచితంగా పంచుతుండేవాడిని. శుభకర్మలలో అనురాగంతో దేవ ద్రవ్యాలను రక్షిస్తూ ఉండేవాడిని. ఆ కాలంలో నేను వినయంతో సచ్ఛీలుడుగా ఉండేవాడిని, సకల ప్రాణుల కోసం పాటుపడుతూ ఉండేవాడిని. అయినా ఎక్కడో తెలిసో, తెలియకో అపరాధం జరిగి ఉండవచ్చు. దాని ఫలితంగా నేను ఘోరమైన ఈ శునక జన్మను పొందవలసి వచ్చింది. ఆ భిక్షువు, తోటి వారికి చెరుపు చేసేవాడు, కోప స్వభావం కలవాడు, క్రూరుడు, కఠినాత్ముడు, మూర్ఖుడు, ధర్మ విరుద్ధంగా నడుచుకునేవాడు. ఇలాంటి వాడు మఠాధిపతి అయితే నరకం తప్పదు. అంతేకాదు ఇతని కారణంగా ఇతని ముందు ఏడు తరాల వారు, తర్వాత ఏడు తరాల వారు నరక యాతనలకు గురి అవుతారు. అందువల్ల మఠాధిపత్యం ఎట్టి పరిస్థితులలోను నేరపరాదు. ఎవరినైనా ఒక వ్యక్తిని, అతని పుత్రులను, బంధువులను, పశువులను నరక బాధలకు గురి చేయాలి, అనుకుంటే దేవాలయానికి గాని, గోశాలలకు గాని, బ్రాహ్మణ సమాజానికి కానీ అధిపతిగా చేయాలి. బ్రాహ్మణుని సొత్తు, దేవాలయం సొత్తు తిన్నవాడు, స్త్రీ, బాలుర సొత్తు తిన్నవాడు, ఇతరులకు దానమిచ్చిన ధనమును తిరిగి తీసుకున్నవాడు, ఆత్మీయులతో సహా నశించిపోతాడు. బ్రాహ్మణుల సంపదలను, దైవ ద్రవ్యములను అపహరించినవాడు వెంటనే అవీచి అనే పేరు గల ఘోరమైన నరకంలో పడిపోతాడు. రామా మనసులోనైనా దేవతల ద్రవ్యాలను బ్రాహ్మణుల సంపదలను అపహరించాల కున్నవాడు నరక పరంపరకు గురి అవుతాడు.' అని శునకం చెప్పింది.

ఆ శునకం మాటలను వినగానే రాముడు యొక్క నేత్రాలు ఆశ్చర్యంతో విప్పుకొన్నాయి. శునకం పూర్వజన్మ జ్ఞానం పొందింది. గొప్ప జ్ఞానం ఉన్నా అది శునక జాతికి చెందినదవడం వల్ల లోకంలో చులకనగా చూడబడింది. చివరకు కాశీ నగరంలో నిరసన దీక్ష చేసి ప్రాణాలు త్యజించి ఉన్నత స్థానానికి చేరుకుంది.

మంగళం కోసలేంద్రాయ మహనీయ గుణాబ్దయే !
చక్రవర్తి తానూజాయ సర్వభౌమాయ మంగళం !! ★


**శ్రీమద్భాగవత సప్తాహ జ్ఞాన యజ్ఞము**

శివధామ్ "శుక్రతాల్", ముజఫర్ నగర్, 251316. ఉత్తరప్రదేశ్ లో

**ప్రవచన కైంకర్యము :**

"పండితరత్న, సాహిత్య శిరోమణి'

డా॥ ఎమ్.టి. ఆళ్వార్ స్వామి వారిచే



(తాడేపల్లి, గుంటూరు జిల్లా.)


సంప్రదించ వలసిన ఫోన్ నంబర్

90599455161, 9394128077

# జీవుడు కర్మను స్వతంత్రుడై చేస్తాడా?

## లేక పరమాత్మే జీవుడిచేత అన్నికర్మలనీ చేయిస్తాడా?

(శ్రీమాన్ పుత్తూర్ కృష్ణమాచార్యస్వామివారి వ్యాఖ్యానానుసారంగా చెప్పబడినది)



**శ్రీమాన్ శ్రీ శ్రీభాష్యం శ్రీనివాసాచార్యులు**

మహాభారతంలో

"శ్రూయతాం పరమం దైవం దుర్విజ్ఞేయం మయాపి చ।
నారాయణస్తు పురుషో విశ్వరూపోమహాద్యుతిః॥"

(మ.భా.సభా. 46-40) నాచేతకూడా తెలుసుకొనటానికి సాధ్యంకాని గొప్పదైన దైవాన్ని గురించి చెప్తున్నాను, విను, లోకమంతటినీ తన శరీరంగా చేసుకొన్నవాడు. గొప్ప తేజస్సుగలవాడూ, పురుషుడు అనబడే నారాయణుడే అతడు) అనీన్నీ, యాజ్ఞవల్క్యులు రచించిన యోగశాస్త్రంలో "ఆర్షం ఛందశ్చ మంత్రాణాం దైవతం బ్రాహ్మణం తథా॥" మంత్రములు ఋషిసంబంధాన్నీ, ఛందస్సులనీ, దేవతనీ అని చెప్పబడింది. ఆ యోగశాస్త్రంలోనే అసురులని భ్రమింప చెయ్యటానికి ప్రజాపతి ఉపదేశించినదాన్ని అనువదించి నప్పుడు

"ఆత్మానం, పూజయన్ నిత్యం భూషణాచ్ఛాదనాదిభిః।
స్వదేహ ఏవ దైవం స్యాదన్యత్ దైవం న విద్యతే॥"

తనయొక్క శరీరాన్ని ప్రతిదినమూ మంచి ఆభరణాలూ, వస్త్రాలూ, మొదలైనవాటిచేత అలంకరించవలెను. తన శరీరమే దైవమగును, వేరు దైవము లేదు అని చెప్పబడింది. విహగేంద్రసంహితలో కూడా

"దైవాధీనం జగత్సర్వం మంత్రాధీనం తు దైవతమ్।
తన్మంత్రం బ్రాహ్మణాధీనం తస్మాత్ విప్రా హి దైవతమ్""

(విహగేం. సంహి. 22-15) లోకమంతా దైవానికి వశమైనది. ఆ దైవం మంత్రానికి వశపడినది. ఆ మంత్రం బ్రాహ్మణుడి వశంలో ఉన్నది. కనుక బ్రాహ్మణులే దైవతములగుదురు అని చెప్పబడింది.

గీతాశాస్త్రంలో కూడా "సాధిభూతాధిదైవం మాం (7-30) అని అధిదైవతాన్ని గురించి ప్రస్తావించి, అధిదైవం కిముచ్యతే (8-1) అధిదైవమని ఏది చెప్పబడుతున్నది? అని అర్జునుడి ప్రశ్న వచ్చినప్పుడు "పురుషశ్చాధిదైవతమ్" అధిదైవమని చెప్పబడేదీ, ఇంద్రుడు మొదలైన దేవతలకంటే గొప్పబ్రహ్మ, లేక బ్రహ్మవంటి దైవంతాలూకు స్థితియే అని సమాధానం చెప్పబడింది. ఛాందోగ్యోపనిషత్తులో కూడా "తస్యోపనిషదహరిత్యధిదైవతమ్" అనే వాక్యంలో సూర్యుడిలో నుండే దేవతకి అధిదైవతమని పేరు చెప్పబడుతున్నది.

శంకరులు కూడా కన్ను మొదలైన ఇంద్రియాలని పోషించే ఆదిత్యుడు మొదలైన దేవతలని అధిదైవత చెప్పుతున్నట్లు వ్యాఖ్యానించారు. అదే కాకుండా, ఆదిత్యుడు మొదలైన దేవతలనీ అనుగ్రహించే పరమాత్మయే దైవశబ్దమునకు అర్థం అని తీసుకొనటమే శ్రేష్ఠం.


స్తోత్రరత్నంలో యామునులు కూడా "ప్రఖ్యాతదైవ పరమార్థవిదాం మతైశ్చ" అని దైవశబ్దాన్ని దేవత అనే అర్థంలో ప్రయోగించారు. భట్టర్ లక్ష్మీకల్యాణం అనే కావ్యంలో "ధర్మే ప్రమాణం సమయస్తదీయో వేదాశ్చ తత్త్వం చ తదిష్టదైవం" అని ఇష్టదేవతను ఇష్టదైవం అని చెప్పారు. కనుక ఇక్కడున్న దైవశబ్దానికి దేవత అని అర్థం చెప్పటం తగినదే. ఏ దేవత అని విశేషించి చెప్పనందుననూ, అన్ని కర్మలనీ నడిపించే కారణుడుగా చెప్పటంచేతనూ, ఇక్కడ దైవశబ్దం పరదేవతను చెప్పితున్నది అని గ్రహించటమే తగినది. ఈ పరదేవత మిగతావారికి ఆత్మగా ఉన్నట్లే ఇతడికి ఒక ఆత్మ అంటూ లేదుగనుక, పరమాత్మా అనబడుతున్నాడు.

శరీరం మొదలైనవి పని చెయ్యటానికి జీవుడు ఎలా ముఖ్యమైన కారణమౌతున్నాడో, అలాగనే ఆ జీవుడినీ పని చేసేటట్లు లోపల ప్రవేశించి నియమించేవాడు గనుక ఇతడు అంతర్యామి అనబడుతున్నాడు. ఈ కారణాలవల్ల వెనకచెప్పిన నాలుగు కర్మహేతువులకంటెను ఇతడు ముఖ్యమైన హేతువౌతున్నాడని తేలింది. గీతలో కూడా "సర్వస్య చాహం హృదిసన్నివిష్టో మత్తః స్మృతిర్ జ్ఞానమపోహనం చ" (గీత15-15) నేను అన్ని జీవరాశుల హృదయంలో ఆత్మగా ప్రవేశించి ఉన్నాను. అందరియొక్క తలంపు, వస్తునిర్ణయము, మరుపు నానుండే కలుగుతున్నాయి) అని ఇదివరకే ఈ విషయం చెప్పబడింది. ★

(సశేషం)

## శ్రీసంప్రదాయ సేవలో

# యాజ్ఞికపీఠమ్



ముఖేముఖే సరస్వతి అన్నట్లు సమాజ శ్రేయస్సు కోసం పెద్దలు అనుగ్రహించే అనుగ్రహభాషణలు ఎంతో విలువైనవి. అవి స్వాతి కార్తెలో పడే ముత్యపు చినుకుల వంటివి. ఈ విధంగా శ్రీమాన్ డా॥ పి.టి.జి.ఎస్ కిశోరస్వామి వారు చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమైనవి.

ఆశయాలు ఎన్ని ఉన్నా వాటి ఆచరణ ఎంతో కష్టం. సమాజ శ్రేయస్సు కోసం ఏదైనా ఒకపని చేపట్టాలంటే నిధులు కావాలి! ఇందుకోసం సవాళ్లు! ప్రతి సవాళ్లు!! వీటిని అధిగమించి ముందుకు వెళ్లినప్పుడే స్ఫూర్తిదాయకమవుతుంది. లాభాపేక్షలేకుండా ఈ బాటలో ముందుకు సాగుతూ శ్రీమాన్ డా॥ కిశోరస్వామి "యాజ్ఞీకపీఠం" స్థాపించారు. వైదిక విద్య శ్రీవైష్ణవులకు అందించాలన్నది వీరి లక్ష్యం. ఈ లక్ష్య సాధనలో బాల్యనుండే నిరంతరకృషి సలిపారు. శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామివారి వద్ద వేద విద్యను అభ్యసించిన నాటి నుండే వివిధ సేవాకార్యక్రమాలను నిర్వహించడం ప్రారంభించారు.

లక్ష్మీ సౌభాగ్యవతి రోహిణితో వివాహం అనంతరం ఆశ్వీయుజ శుద్ధ త్రయోదశి 2004వ సం॥లో యాజ్ఞికపీఠమ్‌ను ప్రారంభించారు. శ్రీపాంచరాత్ర ఆగమ శాస్త్రం, స్మార్త, జ్యోతిష శాస్త్రాలు, వైదికధర్మ ప్రచారాన్ని బోధించడం మరియు వ్యాప్తి చేయడం లక్ష్యంగా యాజ్ఞికపీఠం పేర ట్రస్ట్‌ను స్థాపించారు. ఆర్థిక వనరులు అందించే దాతలు పెద్దగా లేకపోయినా అన్నీ తానై లక్ష్యసాధనలో ముందున్నారు. ట్రస్ట్‌కు అనుబంధంగా యాజ్ఞికదర్శిని పేరుతో ఆధ్యాత్మిక మాస పత్రికను నిర్వహిస్తున్నారు. యాజ్ఞికపీఠం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అందరికీ అందజేయడానికి వీలుగా శ్రీవైష్ణవశ్రీ పేరున ఆన్‌లైన్ బ్లాగ్ పేర ప్రతిరోజు సమాచారం అందిస్తున్నారు. సరళంగా అందరికీ ఆధ్యాత్మిక పుస్తకాలు అందించాలన్న దృక్పథంతో ట్రస్ట్ ద్వారా ప్రచురించిన డిజిటల్ లైబ్రరీని ఆన్‌లైన్‌లో ఏర్పాటు చేశారు. యూట్యూబ్ ఛానల్ ద్వారా, ఫేస్‌బుక్ ద్వారా ప్రత్యక్ష లైవ్ కార్యక్రమాలు స్తోత్ర పాఠాలు నిర్వహిస్తున్నారు. దేశవిదేశాలలోని వారు ధార్మిక కార్యక్రమాలలో ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు. యాజ్ఞికపీఠమ్‌కు అనుబంధంగా ఏర్పాటు చేసిన శ్రీసుదర్శన గోశాలలో గోసంపద దినదిన ప్రవర్ధమానం అవుతోంది. ఒక్క గోవుతో ప్రారంభమైన గోశాలలో రెండు అంకెల సంఖ్యకు చేరాయి.

యాజ్ఞికపీఠమ్ ధార్మిక సంస్థగా, వైదిక సంస్థగా ఇది శాఖోపశాఖలుగా విస్తరించింది. వైదిక పాఠశాలను గురువుగారు శ్రీమాన్ రమాకాంతాచార్యుల వారి పేరుపై నిర్వహిస్తున్నారు. దీనికి అనుబంధంగా ఆన్‌లైన్ పాఠశాలను 2020లో ప్రారంభించారు. ఇందులో 20 నుంచి 60 సంవత్సరాల వయస్సువారికి వివిధ పాఠ్యాంశాలపై శిక్షణపొందే అవకాశం కల్పించారు. ఈ పాఠశాలలో గృహతిరువారాధన, అర్చకత్వం, వందరోజుల వైదిక శిక్షణ, సంపూర్ణ యాజ్ఞిక శిక్షణ, వంద రోజులవైదిక పాఠశాల నిర్వహించారు. వివిధ ప్రాంతాలలో ఉన్న ప్రముఖులను ఆన్‌లైన్‌లో ఆహ్వానించి వైదిక గోష్ఠులను నిర్వహించారు. ప్రతి యేటా పాంచరాత్ర ఆగమ, అర్చక పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులలో స్ఫూర్తిని కలిగించడానికి స్నాతకోత్సవాలు నిర్వహించి ఉత్తీర్ణులైనవారికి ధృవపత్రాలు అందిజేస్తున్నారు.

ఆంధ్ర నమ్మాళ్వార్ పాల్వంచ తిరుమల గుదిమెళ్ళ లక్ష్మీనర్సింహాచార్యులు పేర నాలాయిర దివ్య ప్రబంధ పాఠశాలను ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో ఇంటింటా ద్రావిడ వేద పాఠాలు నిరంతరం యాజ్ఞికపీఠంలో నిర్వహిస్తున్నారు.

కరోనా సమయంలో లోకకళ్యాణార్థం హోమాలు నిర్వహించారు, జగద్రక్షణకై జపయజ్ఞం లాంటి










కార్యక్రమాలను నిర్వహించారు. పర్వకాల సమయంలో విశిష్ట ఉత్సవాల సందర్భంగా ఆన్‌లైన్‌లో ఆదిత్య హృదయ, సుదర్శన శతక పారాయణాలు, పిన్నల పెద్దలకోసం సంప్రదాయ స్తోత్రపాఠాలు నిర్వహిస్తున్నారు. ఇలా ఆన్‌లైన్ ద్వారా వైదిక విద్య అందించిన తొలిసంస్థగా యాజ్ఞికపీఠాన్ని వారు తీర్చిదిద్దారు. ఇటీవల శ్రీపురోహిత పాఠశాలను కూడా ప్రారంభించారు.

నాడు తిరుమలలో శ్రీశ్రీశ్రీ చిన్నజీయరు స్వామి నిర్వహించిన హోమ కార్యక్రమంలో పాల్గొన్నారు. గత సమతామూర్తి ఆవిష్కరణ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన 1008 కుండాల హోమ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రలలో పర్యటించి దానికి కావలసిన శిక్షణనిచ్చి సుమారు మూడు వందలకు పైగా ఋత్విక్‌లను అందించారు. జనగంగా తరంగిణి పేరుతో శ్రీలక్ష్మీ హయగ్రీవ యజ్ఞం, యాజ్ఞిక సమ్మేళనం నిర్వహణ చేశారు.

ఎందరో విద్యార్థులను ఆధ్యాత్మికతవైపు నడిపించడం, దేశరక్షణలో నిరంతరం కాపలాకాసే సైనికుల కోసం సుదర్శన నారసింహం హోమం చేశారు. ఆలయాల పరిరక్షణకోసం ఆయా గ్రామాలలో యువతతో ఆలయ దీక్ష చేయించారు. ధార్మిక సమ్మేళనం, యాజ్ఞిక సమ్మేళనం, శ్రీవైష్ణవ సమ్మేళనం లాంటివి నిర్వహిస్తూ వందలాది వైదిక పండితులను సన్మానించి ప్రోత్సహించారు.

బిరుదులు ఎన్ని అందుకున్నా శ్రీమాన్ పి.టి.జి.ఎస్ కిశోరస్వామి వారు నిగర్వి. ఎవరినైనా మృదువుగా ప్రేమగా పలకరించడమే వారి నైజం. వారు అందిస్తున్న సేవలను గమనించిన దేశ విదేశ సంస్థల వారు, ప్రముఖులు, ఆచార్య పురుషులు వివిధ పురస్కారాలతో సత్కరించారు. శ్రీమాన్ కిశోరస్వామి వారి కీర్తికిరీటంలో చేరిన పురస్కారాలలో “తిరుప్పావై కేసరి, యాజ్ఞికరత్న, వైదిక సేవాతత్పర, ఆగమరత్న, జ్యోతిష శిరోమణి, సెంట్రల్ ఆఫ్ అమెరికా సాహితీ యూనివర్శిటీ వారిచే గౌరవ డాక్టరేట్, పాంచరాత్రాగమ, శ్రీశ్రీ పరిపూర్ణానంద స్వామి చేతులమీదుగా ఆధ్యాత్మిక, సామాజిక సమన్వయ సుధీ” అనే బిరుదులు అందుకున్నారు.

పిటిజిఎస్ కిశోరస్వామి వారికి ప్రతిష్ఠ, బ్రహ్మోత్సవాలు, యజ్ఞయాగాలు, ఆధ్యాత్మిక ప్రబోధాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, జీర్ణోద్ధరణ, మహా సంప్రోక్షణలో అపారమైన అనుభవం ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని సుమారు 50 దేవాలయాల ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించారు. అలాగే ప్రముఖ ఆలయాలలో బ్రహ్మోత్సవాలు కూడా వీరి నేతృత్వంలో జరుగుతున్నాయి. నైమిశారణ్యం రంగమందిర్‌లో శ్రీరంగనాథ స్వామి వారి ప్రతిష్ఠ శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారితో పాటు పాల్గొన్నారు. మరియు నైమిశారణ్యంలో శ్రీరామచంద్ర, శ్రీకృష్ణ, సత్యనారాయణ స్వామి ప్రతిష్ఠలు చేశారు.

సంప్రదాయ కార్యక్రమాల నిర్వహణలకు తగు వసతి సౌకర్యాలు స్వగృహాలలో ఉండనందున శ్రీవైష్ణవుల సౌకర్యార్థం యాజ్ఞికపీఠం 2021 ఆగస్టులో శ్రీరామానుజకూటం ప్రారంభించింది. యాజ్ఞికపీఠం ద్వారా నిర్వహించే ఏ కార్యక్రమంలో లాభాపేక్ష లేకుండా నలుగురికి ప్రయోజనం కలిగించాలన్నదే శ్రీమాన్ పి.టి.జి.ఎస్. కిశోరస్వామి వారి ఆశయం. వైదిక ధర్మ పరిరక్షణ కొరకు ఆచార్య నిష్ఠతో శ్రీమాన్ డా॥ పి.టి.జి.ఎస్. కిశోరస్వామి వారు యాజ్ఞీకపీఠం నిర్వహిస్తున్నారు. ★






# తెలుసు కోవలసినవి మూడే!

(క్రిందటి సంచిక తరువాయి)

ప్రతీ వ్యక్తి తెలుసుకోవలసినవి చిత్ (జీవుడు), అచిత్ (ప్రకృతి) ఈశ్వర (శ్రీమన్నారాయణుడు) అను మూడు తత్వములు. వీటిస్వరూప స్వభావములను తెలుపుటకే "చిదచిత్ ఈశ్వర" అను ఈ మూడు ప్రకరణములతో కూడిన తత్త్వత్రయము అను గ్రంథము పరమకారుణికులైన పిళ్ళై లోకాచార్యుల వారనుగ్రహించగా మనకు లభించింది. వాటిలో మొదటది చిత్ తత్వము. అంటే జీవుడని, ఈజీవుడు దేహ ఇంద్రియ మనః ప్రాణాదులకంటే వేరైవాడని ఇంతవరకు మనం తెలుసుకున్నాం.

చిత్ : ఈఆత్మయొక్క మరియొక లక్షణం "అజడత్వము", జడము అనగా తనంతతాను ప్రకాశించనిది. అజడము అనగా స్వయంప్రకాశకము అనగా తనంతట తానుగా ప్రకాశించుట. ఈజీవుడు స్వయంప్రకాశకుడు. స్వయం ప్రకాశకత్వము అనగా ఒకదీపము వేరొక దీపము అవసరము లేకుండా ఎట్లు ప్రకాశించునో అట్లు ప్రకాశించుట (కనబడుట). దీపమువలె జీవుడుకూడా జ్ఞానముతో సంబంధము లేకుండా తనంతట తానుగా తెలియుట. ఈ జీవుని గురించి ఉపనిషత్తులు "హృద్యంతర్జ్యోతిః పురుష" (హృదయ మధ్యములో ప్రకాశించు పురుషుడు), "అత్రాయంపురుష స్వయం జ్యోతిర్భవతి" (జీవుడు స్వయం ప్రకాశకుడుగా యున్నాడు), "విజ్ఞాన ఘన" (జీవుడు విజ్ఞాన స్వరూపుడు), "ఆత్మాజ్ఞానమయః" (ఆత్మజ్ఞానమయము) మరియు "తచ్చజ్ఞానమయం వ్యాపి స్వసంవేద్యం అనూపమమ్" (ఆత్మ జ్ఞానమయము, వ్యాపించుస్వభావం కలది, స్వసంవేద్యము అనగా తనకుతనే తెలియునది, ఎట్టి ఉపమానము లేనిది) అని తెలిపినవి.

ఈ ఆత్మయొక్క మరియొక లక్షణం 'ఆనందరూపముగా నుండుట'. రూపముగానుండుట యనగా సుఖముగా నుండుట. అనగా తనకుతాను ఇష్టమైయుండుట, అనుకూల స్వభావము కలిగియుండుట. వేరొరితో సంబంధములేకుండా తనకు తానే సుఖరూపముగా నుండుటయే ఆనందరూపము. ఆత్మ ఆనందముగానుండును అని ఎట్లు తెలియుచున్నది? అనగా నిద్రపోయి లేచినవాడు నేను సుఖముగా నిద్రించితిని అని అనుచున్నాడుకదా! ఆనిద్రా సమయములో వీనికి బాహ్య జ్ఞానము లేకుండుటచే, వీనికి ఆత్మానుభవమే యుంటున్నది. అందువలన సుఖముగా



**శ్రీమాన్ శ్రీ వంగల వెంకటాచార్యులు**

నిద్రించాను అనుచున్నాడు. ఆత్మ సుఖరూపముగానుండుట అనునది మనకు ప్రత్యక్షముగానే తెలియుచున్నది. దీనిద్వారా దేహమే ఆత్మ అయినచో ఇట్లు నేను సుఖముగా నిద్రించాను అని చెప్పుట కుదరదు. దీనివల్ల దేహమే ఆత్మయను వాదము ఖండింపబడినది.

ఈఆత్మయొక్క మరియొక లక్షణం 'నిత్యత్వం'. నిత్యత్వం అనగా ఎప్పుడూ ఉండుట. ఇదియే సర్వకాలవర్తిత్వము (అన్ని కాలాలలోను యుండుట). ఆత్మ నిత్యం కనుక ఒకప్పుడు ఉన్నది ఒకప్పుడు లేదు అనుమాట యుండదు. మరి ఈ ఆత్మ ఎప్పుడూ ఉండేది అయితే జన్మమరణములు ఆత్మకు ఉండుట ఎట్లు కుదురుతుంది. ఉపనిషత్తులు 'యతోవా ఇమాని భూతాని జాయన్తే యేన జాతాని జీవన్తి యత్రయనభిసంవిశంతి' ఎవని వలన ఈభూతములు పుట్టుచున్నవో, పుట్టినవి ఎవనివలన జీవించుచున్నవో మరియు ఎవనియందు లయమగుచున్నవో అని చెప్పినమాట ఎట్లు కుదురుతుంది. అన్నచో జీవుడు జన్మించుటయనగా ఒకదేహముతో సంబంధమును పొందుట అనగా జీవుడు ఒక దేహములో ప్రవేశించుట. మరణమనగా ఆదేహమును విడిచిపెట్టుట అని అర్థం.

మీరు మరి ఆత్మను నిత్యము అని అనుచున్నారు కదా అట్లైనచో సృష్టికి ముందు ఎవరూలేరు పరమాత్మ ఒక్కడేయున్నాడు అని వేదం చెప్పిన మాట కుదరదుకదా! అన్నచో అప్పుడు ప్రళయకాలంలో ఈ ఆత్మలన్నియు పరమాత్మతో చేరి నామరూప విభాగానర్హమై పేర్ల తోయున్నవి (ఈ రూపములతో యున్నవి అనిచెప్పుటకు వీలులేకుండా ఉండుట) పరమాత్మ దివ్య శరీరములో విడదీయుటకు వీలులేని ఒకభాగమై యుండును తప్ప లేకుండా యుండవు.

## తెలుసుకోవలసినవి మూడే!

సంహారదశలో ఆత్మలు లేకుండా యున్నచో పరమాత్మను ఉపాదానకారణముగా చెప్పుట కుదరదు. ఉపాదానమనగా మూల ద్రవ్యము. లోకంలో ఏవస్తువు తయారుకావాలన్నా మూలద్రవ్యము ఉదాహరణకు కుండ తయారుకావాలంటే మట్టి అనే మూలద్రవ్యము కావలెను. కానీ పరమాత్మతానే ఉపాదానమవుతాడు. పైన తెలిపినట్లు తన (పరమాత్మ) శరీరములో ఒకభాగమైయున్న ఈజీవులను తననుంచి వేరుచేసి సృష్టించును. దీనినిబట్టి ఆత్మలు నిత్యము ఎప్పుడూ ఉండును అను విషయము తెలియుచున్నది.

ఈ ఆత్మ యొక్క మరియొక లక్షణం 'అణుత్వం'. అణుత్వం అనగా అణుపరిమాణములో యుండుట. అణువంత యుండుట. ఈ జీవుడు హృదయప్రదేశమునుండి ఈ శరీరమును వదలి బయటకు వెళ్ళును, వచ్చును అని వేదము చెప్పుటచేత ఆత్మ అణువుయను విషయము తెలియుచున్నది. వేదము 'హృదిహ్యేవాయమాత్మా' ఈ ఆత్మ హృదయము నందుండును అనిచెప్పినది. అంతేకాక ఈఆత్మ కంటినుంచిగానీ, శిరస్సునుంచిగానీ శరీరములోని ఏదో ఒక భాగములనుండి బయటకు పోవుచున్నది యని వేదము తెలిపినది. మనంకూడా చనిపోయిన వ్యక్తిని చూచిన, జీవుడు వీని కంటినుంచి పోయాడు, ముక్కునుంచి పోయాడు అని అనుట లోకములో కూడా వింటూనే యున్నాముకదా. అలాగే ఆయాలోకాలైన స్వర్గ నరకాలలో ప్రవేశించి తిరిగి మళ్ళీ వచ్చుచున్నది యని వేదము చెప్పుటచేత ఆత్మ అణువుయను విషయము స్పష్టముగా తెలియుచున్నది. ఆత్మ అణువుకాని యెడల ఇట్లు ప్రయాణము చేయుట కుదరదుకదా! వేదము 'ఏషోఽణురాత్మా చేతసా వేదితవ్య' ఈ ఆత్మ అణువుగానుండి మనస్సు చేతనే తెలుసుకోదగినవాడు యని. 'వాలాగ్ర శతభాగస్య శతథా పరికల్పితస్యచ భాగోజీవః సవిజ్ఞేయః' 'వడ్లగింజ పైనుండు ముల్లును తీసుకొని దానిని వంద భాగాలుగా చేసి ఆవందలో ఒకభాగాన్ని మరల వంద భాగాలు చేసినచో అందులో ఒక భాగము ఎంతయుండునో ఈ ఆత్మ అంతయుండును. ఇట్లు వేదము, ధర్మశాస్త్రములు ఆత్మ అణువంత యుండునని చెప్పెను. కనుక ఆత్మ స్వరూపము అణు స్వరూపము.

(మిగతా వచ్చే సంచికలో తెలుసుకుందాము) ★

## శ్రీపరాంకుశ సుధాంబోధి



తిరు మాలిరుమ్ శోలి దివ్య దేశము. దక్షిణ శ్రీశైలం. తెర్కు తిరుమలై. శ్రీమన్నారాయణుడు సర్వాంతర్యామి సర్వేశ్వరుడు సకల కళ్యాణ గుణధాముడు. ఆశ్రితులను అనుగ్రహించు అచ్యుతుడు. శిష్టరక్షణ దుష్టశిక్షణ గావించుటకై అనేక అవతారము

### శ్రీమాన్ పి. కృష్ణమూర్తి


లలో ఆవిర్భవించిన ఆ పరమాత్మ తిరుమాలిరుంశోలి దివ్యదేశమునందు సుందర బాహు స్వామిగా వెలసి ఆశ్రితుల కోరికలను ఈడేర్చుతూ మిక్కిలి ప్రసిద్ధి నందినాడు.

శ్రీనమ్మాళ్వార్లు వారి తిరువాయిమొళి దివ్య ప్రబంధములో ఆ దివ్య దేశమును గురించి అత్యంత రమణీయముగా ఈ దశకములో వర్ణించియున్నారు. ఆ దివ్య దేశ నామమును తలచినంతనే సంసారమున కలుగు సకల దుఃఖములు నశించునని, ఆ దివ్యదేశ నాథుడైన సుందర బాహు స్వామిని ఆశ్రయించి దర్శించినచో పరమపద ప్రాప్తి కలుగును అని తెలియజేసియున్నారు. కావున భక్తులెల్లరూ ఆ స్వామిని ఆదివ్య దేశమును తలుచుకొని ఆశ్రయించి తరించెదరు గాక!

సీ. అభ్యుదయము నెంచి అడుగు వేసడి వేళ
ప్రాయపు పొంగులో ప్రమితి నెరిగి
విషయాంతరాదులు వెన్ను తట్టకముందు
చెడు మార్గవర్తియై చెడకముందు
ఆశ్చర్య చేష్టల అపురూప గుణముల
మాయావి కృష్ణయ్య మనసు పడిన
పల్లవ శోభిత పాదపశ్రేణుల
తిరుమాలిరుంశోలి దివ్య నగము

తే.గీ. చుట్టు ఉద్యానవనములు చుట్టి యున్న
పరమ పావన నిలయంబు పాపహరము
అందువసియించు సర్వేశ్వరుడసుర వైరి
ఆశ్రయింపుము పురుషార్థమందు కొనుము ★

# వయస్సు-మనస్సు



**శ్రీమాన్ శ్రీ కవి కృష్ణమాచార్యులు**

మనమంతా ఎక్కువగా మక్కువతో ప్రేమించేది మన శరీరాన్నే. శారీరక సుఖాల కోసం ఏపనైనా ఎంతపనైనా చేయడానికి వెనకాడం మనం. ఎన్నెన్ని భోగాలు అనుభవిస్తున్నా అన్నన్ని భయాలు కూడా మనని వెంటాడుతున్నాయి. "భోగే రోగభయం సుఖే క్షయ భయం" అన్నట్టు భోగాలనుభవిస్తే రోగా లొస్తాయని భయం, సుఖంగా ఉన్నామని ఆనందించేటప్పుడు అది క్షీణిస్తుందని భయం. భయాలొస్తాయని భోగాలను అనుభవించడం మానుకోమంటారా? మానుకోమనడం లేదు పూనుకోమనే చెప్తున్నాం! కానీ, ఆ పూనిక కానుకగా ఉండాలి. తప్పు హానికరంగా ఉండరాదు. "భోగ సంకోచః తపః" అని శాస్త్రవచనం. సమయ సందర్భాలని బట్టి ధర్మవిరుద్ధం కాకుండా మితంగా భోగాలను అనుభవించవచ్చు. మితిమీరినప్పుడు మతిమారుతుంది, మతి మారినప్పుడు అధోగతి మన జత చేరుతుంది. అందుకే అన్ని వేళలా మితమే హితం! అదే పెద్దలందరి అభిమతం!

మనం ప్రతి సంవత్సరం పుట్టినరోజుని ఎంతో ఘనంగా జరుపుకొంటాం. ఒకవేళ వీలుపడక రెండు సంవత్సరాలు పుట్టినరోజు జరుపుకోక పోతే రెండు సంవత్సరాల వయస్సేమీ తగ్గదు. అది అప్రయత్నంగా పెరుగుతూనే ఉంటుంది. వయసు పెరగాలని ఎవరూ కోరుకోరు, అది తరగాలనే కోరుకుంటారు కానీ, ఎలాగూ అది తరగదు కనుక కనీసం అది తరిగినట్టు యవ్వనంగా కనిపించాలని పరితపిస్తారు. దానికై పరిపరి విధాలుగా పరికరాలను తెప్పిస్తారు. ఎంత తపించినా, ఎన్ని తెప్పించినా పెరిగే వయస్సుని తప్పించడం, తగ్గించడం ఎవరి తరం కాదు, అటువంటి వరం కూడా లేదు.

సూర్యుడు ఉదయిస్తూ అస్తమిస్తూ సకల ప్రాణుల ఆయువుని హరిస్తాడని వేదం తెలియజేస్తుంది. రోజు రోజుకి ఆయువు తగ్గుతూ వయస్సు పెరుగుతూ ఉన్న దశలో మనకు దిశానిర్దేశం చేసేదే శాస్త్రం. "మన ఏవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః"అని శాస్త్రం చెప్తుంది. సుఖానికైనా దుఃఖానికైనా, భయానికైనా, ధైర్యానికైనా, ఓటమికైనా, గెలుపుకైనా, బంధానికైనా, మోక్షానికైనా అన్నిటికీ కారణం మనస్సే!

సంస్కరింపబడిన మనస్సు మిత్రునివలె రక్షిస్తుంది, సంస్కారహీనమైన మనస్సు శత్రువువలె శిక్షిస్తుంది. పరిగెత్తే మనస్సుని సాధనతో అదుపు చేస్తే పెరిగే వయస్సుని పొదుపు చేసినట్టే! మనస్సుని అరికట్టడం అంటే హరిపాదాలపై పెట్టడం. శ్రీహరిని "చింతయామి హరిమేవ సంతతమ్" అంటూ మనసున నిలుపుకున్నవాడు ఆనందోత్సాహాలతో వృద్ధాప్యాన్ని కూడా యవ్వనంగా మలుచుకొంటాడు. కామక్రోధాది అరిషడ్వర్గాలను మనసున నింపుకున్నవాడు నిర్లక్ష్య, నీరస, నిరాశా, నిస్పృహతో యవ్వనాన్ని కూడా వృద్ధాప్యంగా మార్చుకుంటాడు.

పెద్దతనమనేది పెరిగిన వయస్సుని బట్టి రాదు, సదాలోచనలతో ఎదిగిన మనస్సుని బట్టి వస్తుంది. సదాలోచనలతో పండిన మనస్సు ద్వారా జీవితం ఆనందపు ఉషస్సుగా మారుతుంది. దురాలోచనలతో నిండిన మనస్సు ద్వారా జీవితం శోకపు తమస్సై తీరుతుంది. "పిఞ్జాయ్ పృళత్తాళై ఆణ్డాళై" అంటూ ఐదు సంవత్సరాల పిన్న వయస్సులోనే పండిన పరమభక్తి కలది గోదమ్మ అంటూ ఉపదేశరత్తినమాల మానవాళికి ఉపదేశిస్తుంది. పిన్నవయస్సులోనే భక్తితో పెరియపెరుమాళ్ళని వరించి అందరికన్నా పెద్దతనాన్ని సొంతం చేసుకొని, పెద్దతనమనేది ప్రాపంచిక విషయానురక్తి వల్ల కాదు విశేషభక్తివల్ల ఏర్పడుతుందని నిరూపించింది.

ఈ వయస్సు మనస్సులను గురించిన రెండు వాక్యాలు మరువరాదు

"వద్దు వద్దన్నా వచ్చేది వార్ధక్యం
సౌమనస్యంతోనే జీవితానికి సార్థక్యం"

# కోరికలు ఈడేర్చు కొంగు బంగారు స్వామి








పూర్వం నుండి గొప్ప ఆధ్యాత్మిక చరిత్ర గల గ్రామం కోరుట్ల. జగిత్యాల జిల్లా నిజామాబాద్ రహదారిలో గల ఈ గ్రామం వ్యాపార కూడలిగా వాసికెక్కింది. జీయర్ మఠం, వేదపాఠశాల, సంస్కృతపాఠశాల కలిగి ఉండడమే కాకుండా ఎందరో పండితులకు, ఆధ్యాత్మిక వేత్తలకు పుట్టినిల్లు. సంస్కృత తెలుగు భాషల్లో శతావధానాలు నిర్వహించిన ఆధ్యాత్మిక వేత్త శ్రీమాన్ శిరిషినహాళ్ కృష్ణమాచార్యుల జన్మస్థలం. గొప్పచరిత్ర గల కోరుట్ల గ్రామంలో శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శిస్తేనే కోరికలు ఈడేరుతాయని భక్తుల విశ్వాసం.

పూర్వము కోరవట్టు గ్రామంలో 1100 సంవత్సరాల క్రితం కోరవట్టు రాజు పరిపాలిస్తున్నటువంటి సమయంలో అతనికి సంతానము లేకపోవడం వల్ల చాలా దిగులుతో ఉండేవాడు. అప్పుడు అతనికి వేంకటేశ్వర స్వామి స్వప్నంలో సాక్షాత్కరించి "నాయనా నీవు తిరుపతికి రా అక్కడ నేను నీకు ఒక వస్తువుని ఇస్తాను. అది తీసుకొని వచ్చి మీ రాజ్యంలో ఒక స్థలంలో పెట్టు అప్పుడు అక్కడ నా దేవాలయం నిర్మాణము చేయు అని స్వప్నంలో చెప్తాడు. దాని ప్రకారము ఆ రాజు తిరుపతి వెళ్ళగానే ఎదురుగా ఒక బ్రాహ్మణుడు ఒక పూర్ణ కొబ్బరికాయను తీసుకొని వస్తాడు. నాయనా ఇది తీసుకో అని అతనికి ఇస్తాడు. అప్పుడు అతను అయ్యా మీరు కూడా నా వెంట రావాలి అని కోరాడు. ఆ బ్రాహ్మణుడు "నేను నీతో వస్తాను కానీ వెనక్కి తిరిగి చూడకూడదు" అని చెప్పాడట ఆ రాజు అలానే చేస్తాడు. రాజ్యంలోకి వెళ్ళగానే తన భార్యను పిలిచి "కొబ్బరికాయను ఇచ్చారు ఆ బ్రాహ్మడు కూడా నాతో వచ్చాడు" అని చెప్పగానే అప్పుడు ఆమె ఆ బ్రాహ్మణుని చూస్తుంది. చూడగానే ఆయన వెంకటేశ్వర స్వామి శిలా రూపంలో అక్కడే దర్శనమిస్తాడు. అదే స్థలము ఇప్పుడు ఉన్నటువంటి వెంకటేశ్వర స్వామి దేవాలయము. ఆ రాజు అక్కడే దేవాయాన్ని నిర్మించాడు.

ఈ దేవాలయంలో 12 సంవత్సరాల కిందట మాఘ శుద్ధ పౌర్ణమి శుక్రవారం నాడు ఉదయము ఏడు గంటలకి ఆలయ







అర్చకుడికి గోదాదేవి విగ్రహము మూలవిరాట్టు లభించడం జరిగింది. ఈ దేవాలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ధనుర్మాస ఉత్సవాలు, నమ్మాళ్వారు పరమపదోత్సవ కార్యక్రమాలు, అన్నకూటోత్సవం, ముక్కోటి ఏకాదశి, వసంత నవరాత్రులు బ్రహ్మోత్సవాలు చాలా వైభవంగా జరుగుతూ ఉంటాయి. స్వామి కొలిచిన వారికి కొంగు బంగారం లాగా ఇక్కడ కోరుట్లలో కొలువై ఉన్నాడు. అదేవిధంగా కార్తీక నక్షత్రాన్ని పురస్కరించుకొని 108 ఆలయ ప్రదక్షణ కార్యక్రమం జరుగుతుంది. వేలమంది చుట్టుపక్క గ్రామాల నుండి విచ్చేసి ఈ ప్రదక్షిణ కార్యక్రమంలో పాల్గొంటారు. వారి యొక్క కోరికలని నెరవేర్చుకుంటారు ఇది కోరుట్ల కోనేటిరాయుడి యొక్క వైభవం, ఇక్కడ ఆళ్వార్ల సన్నిధి కూడా ఉంటుంది. పాంచరాత్రాగామ విధానంతో ఆరాధనలు జరుగుతాయి. తరాలనుండి బీర్నంది వారు అర్చక కుటుంబం వారు పూజలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం బీర్నంది నరసింహా చార్యులు అర్చకత్వం నిర్వహిస్తున్నారు. ★





# నవరాత్రి ఉత్సవాలు




యాదాద్రి జిల్లా స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఘనంగా దసరా నవరాత్రి ఉత్సవాలు, దసరా రోజు అశ్వ వాహన సహిత రథోత్సవం వైభవంగా జరిగింది. మరియు రాత్రి రావణ దహన కార్యక్రమం జరిగింది.



కొండపలకల గ్రామం లో శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయములో శమీ పూజ కార్యక్రమము





గంగిపల్లి గ్రామం, మానకొండూర్ మం॥లో దసరా సందర్భంగా ఆయుధ పూజ. అధిక సంఖ్యలో గ్రామస్తులు, భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

# నవరాత్రి ఉత్సవాలు



దుర్గా నవరాత్రి ఉత్సవాలు గోధూరు, జగిత్యాల జిల్లాలో గూరూడు గణేష్, అధ్యక్షులు, వెల్మల శ్రీనివాస్, కార్యదర్శి, తాటికొండ పవన్ కుమార్, తేలుకంటి గంగాధర్, తాటికొండ సంతోష్ కుమార్, బూరం నరేందర్, దురిశెట్టి నరసింహ రాజు, పిల్లి తిరుపతి, బండి నరేష్, పడాల శ్రీనివాస్, ఎడపల్లి శంకర్, చీమల రాజు, రాచకొండ నర్సు, చెట్ల రోషిణి, నీర లక్ష్మి, నీర జల, అంగరి పద్మ వైభవంగా నిర్వహించారు.





దసరా ఉత్సవాలలో భాగంగా గోధూరు, జగిత్యాల జిల్లాలో పది రోజులు రాత్రి 11 గంటల వరకు గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వాహన సేవను దేవాలయ కమిటీ సభ్యులు, చైర్మన్ ఎడపల్లి వెంకటస్వామి, వైస్ చైర్మన్ సోమ ప్రవీణ్, వేముల నర్సిరెడ్డి, బుడత దినకర్, మధు మల్లేష్ రాజు గార్లు. విజయవంతంగా నిర్వహించారు.




నిజామాబాద్ జిల్లా ఇందూరు తిరుమల శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు రోహిత్ స్వామి వేద పండితులు సేనాపతి సంపత్ కుమార్ ఆచార్యులు ఆలయ ధర్మకర్త నరసింహ రెడ్డి ప్రముఖ నిర్మాత దిల్ రాజు గ్రామప్రజలు స్వామి సేవలో పాల్గొన్నారు.




శ్రీహరిహరేశ్వరాలయం తూంకుంట గ్రామము, అనంతపూర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్



బీర్పూర్ లో జరిగిన శరన్నవ రాత్రి మహోత్స వాలు మరియు దసరా ఉత్సవములు



విజయ దశమి సందర్భంగా జనగాం జిల్లా రఘునాథ్ పల్లి మండలం నిడిగొండ గ్రామం లోని పెద్ద గుట్ట పై వేంచేసి ఉన్న లక్ష్మీ నృసింహస్వామి ఆలయం అశ్వ వాహనంపై స్వామి తన దర్శనాన్ని అనుగ్రహించారు.



# బాలవిజ్ఞానం

# చదువు-ప్రణాళిక

శ్రీమతి విజయ కందాళ



ఒక పాఠశాలలో ఉపాధ్యాయిని వాగీశ్వరిదేవి. ఆమె ఎంతో శ్రద్ధగా విద్యార్థులకు బోధించేది. ఒకానొక సమయంలో ఆమెకో పెద్ద సమస్య వచ్చింది. ఆమె తరగతిలో శాలిని. సుమిత్ర అనే ఇద్దరు విద్యార్థినిలు ఉండేవారు

శాలినికి ఆత్మభిమానం, బద్ధకం రెండు ఎక్కువే. సుమిత్రకు ఆత్మభిమానంతో బాటు శ్రద్ధ శ్రమించే నైజం ఉన్నాయి.

ఎప్పుడు తక్కువ మార్కులు వచ్చే శాలినిని బాగుచేసే బాధ్యత వాగ్దేవిపై పడింది.ఆమెలో పరివర్తన తేవటానికి ఒక రోజు తనతో పాటే తన ఇంట్లో శాలినిని ఉంచుకున్నది. సాయంత్రం ఆమెతో కొన్నివిషయాలు ముచ్చటించి తన చిన్ననాటి అనుభవాలు చెప్పింది.

“సమాజంలో మనిషికి నిజమైన గౌరవం అభిమానం అనేవి జ్ఞానం వల్లనే సాధ్యం. జ్ఞానం అంటే కేవలం మార్కులు మాత్రమే కాదు. దాన్ని సాధించాలంటే, చదువు గురించి మరింత శ్రద్ధనే గాక అన్ని విషయాలపై పరిశీలన ఉండాలి. శ్రద్ధ ఎలా పెంచుకోవాలి? అంటే బద్ధకం వదిలేయాలి. బద్ధకాన్ని ఎలా వదిలించు కోవాలి? అంటే వాయిదా వేసే గుణాన్ని మానేయాలి. రేపు చదువుతాను. రేపు రాసుకుంటాను. రేపు నేర్చుకుంటాను అని అన్నింటిని వాయిదా వేస్తూ ఉంటే, ఆ రేపు ఎప్పటికీ రాదు. అలా రేపులు ఎన్నో వస్తూ పోతూ ఉంటాయి కానీ. మనం అనుకున్న పనులు మాత్రం పూర్తికావు.

మనలోని లోపాలను తగ్గించుకుని, మరింత మెరుగైన వ్యక్తిత్వాన్ని, అలవాటు చేసుకోవాలంటే, మొదలు చేయాల్సిన పని ఒకటి ఉంది. అదే ప్రణాళిక. అయితే అంత మాత్రమే సరిపోదు. దాన్ని క్రమం తప్పకుండా పాటించడమూ అవసరమే. ఎలా అంటే మీరు మెట్లు ఎక్కి పై అంతస్తుకి వెళ్లాలనుకుంటారు. అనుకుంటే వెళ్ళిపోగలరా? వెళ్లలేరు. మెట్లు ఎక్కినప్పుడు మాత్రమే పైకి చేరుకుంటారు. అలాగే ప్రణాళిక వేసుకుంటే సరిపోదు దాన్ని పాటించాలి. అప్పుడే అభివృద్ధి మీ సొంతం అవుతుంది. ఇలా ఎన్నో మంచి విషయాలు ప్రేమతో చెప్పే వాగ్దేవి మాటలకు ఆకార్షితురాలయింది శాలిని. తెల్లవారి ఉదయాత్ పూర్వమే శాలినిని నిద్ర లేపింది వాగ్దేవి.

త్వరగా మేల్కొని ఏమి చేయాలని సందేహిస్తున్న శాలినికి పుస్తకాలు ఇచ్చి ఎందుకు ప్రొద్దున్నే చదవాలో చెప్పసాగింది. “తెల్లవారుజామున ఎందుకు చదవాలో మా పెద్దలు చెప్పేవారు. దానికి నేను పాటించింది నీకు చెప్తున్నాను. తెల్లవారుజామున ఆకాశమార్గంలో తథాస్తు దేవతలు వెళ్తుంటారట. వారు ప్రయాణిస్తూ చూస్తూ ఎవరు ఏం చేస్తున్నా తథాస్తు అని దీవిస్తూ వెళ్తారు. అంటే మనం అప్పుడు ఏం చేస్తుంటే అలాగే అగుగాక అని అర్థం. మనం నిద్రిస్తే పడుకుంటూనే కాలం గడుపుతాం. చదువుతుంటే అదే కొనసాగిస్తాం అని దాని భావం. అంతే కాదు ఆ సమయంలో పరిసరాలు నిశ్శబ్దంగా ఉంటాయి. వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. స్వచ్ఛమైన గాలి వీస్తుంటుంది. రాత్రంతా నిద్రించి ఉన్నందున మన మెదడుకు తగినంత విశ్రాంతి దొరికి, ఉత్సాహంతో ఉంటుంది. ఏ ఆటంకాలు ఉండవు . ఆ ప్రశాంత వాతావరణంలో మనం చేసిన పని, చదివిన చదువు బుర్రలో నాటుకొని పోతుంది. సులువుగా మనసుకి ఎక్కుతుంది. ఎక్కువ కాలం గుర్తుంటుంది.

అలా ప్రశాంత వాతావరణంలో వాగ్దేవి మాటలు శాలిని మనసుపై మంత్రంలాగ పని చేశాయి. మనసులో తన చదువుకో ప్రణాళికను వేసుకొన్నది “మీరు ఈ విషయాలు సుమిత్రకుకూడా చెబుతుంటారా? అని అడిగింది శాలిని. అవునని ఆమె తల నిమురుతూ ఆశీర్వదించింది వాగ్దేవి. ★

**PRAPATTI SRISANNIDHANAM** Telugu Monthly **NOV 2024** **RNI NO : TELTEL/2024/89280**
**Publication Date 1st of Every Month, Posted at Karimnagar, DOP : Every month 5th / 6th**


# శ్రీసన్నిధి పదకేళి 9

## అడ్డం

1. బతుకమ్మ ఎన్ని రోజుల పండగ (6)
2. మార్కండేయుని ఎవరనుగ్రహించారు. (6)
3. దసరానాడు ఈ పూజ చేస్తారు. (5)
7. ఐశ్వర్యము నిచ్చే దేవత(4)

## నిలువు

4. శ్రీమన్నారాయణుని వక్ష స్థలంలో ఉండే అమ్మవారు (4)
5. ఉత్తానపాదుని తండ్రి (7)
6. అనంతాళ్వాన్ పద్మావతి దేవిని దేనికి బంధించారు. 5)
8. చివర నుండి నాలుగవ మాసం (4)
9. ప్రతిపత్ అంటే? (3)
10. శ్రీరాముచంద్రుడి జన్మ నక్షత్రం (4)
11. మొదటి తెలుగు నెల (2)
12. రఘువంశ మూల పురుషుడు (3)
13. హిమాలయాలగుండా ప్రవహించు నది(2)






## శ్రీసన్నిధి పదకేళి (8) సమాధానాలు

1. భక్తరామదాసు, 2. అనసూయాదేవి, 3. అనంతాళ్వాన్లు 4. గణపతి, 5. వరాహావతారము, 6. విష్వక్సేనుడు, 7. విద్యాలక్ష్మి 8. ధైర్యలక్ష్మి 9. గుహుడు, 10. గజలక్ష్మి, 11. మూడు, 12. చిన్నది, 13. మూడే.

సరియైన సమాధానాలు పంపినవారు.

శ్రీమతి జి.సువర్ణ, సిరిసిల్ల, ప్రసన్నలక్ష్మి, ఉప్పల్, హైదరాబాద్, సత్యనారాయణ, బెంగళూరు, టి.దుర్గారాణి, వైజాగ్. విజేతలకు నవంబర్ నెల పత్రిక పంపించడం జరుగుతుంది.

### పదకేళిలో పాల్గొనండి! ఉచిత పత్రిక అందుకోండి!!

ఈ పదకేళిలో సరియైన సమాధానాలు వ్రాసి సరియైన జవాబులు 9502583323 వాట్సప్ ద్వారా పంపండి.

Printed & Edited and Published by DINGIRI SRINIVASA MURTHY on behalf of SRISANNIDHANAM CHARITABLE TRUST and Published at H.No 10-2-225, Vidhyanagar, Karimnagar, Telangana - 505 001
Editor DINGIRI SRINIVASA MURTHY, RNI No. TELTEL/2024/89280,
Cell No : 9502583323, Land line No 0878-2253323, Email Id prapatti.srisannidhanam9@gmail.com.